


విజయభాను

45వ వార్షికోత్సవం విజయభాను

విశాఖపట్నం, శుక్రవారం 18-02-2022 | VIJAYABHANU DAILY * VISAKHAPATNAM | సంపుటి : 45 సంచిక : 128 పేజీలు : 08 వెల : 1 రూపాయి

# విజయవాడ బెంజ్ సర్కిల్ ఫ్లై ఓవర్-2 ప్రారంభోత్సవం

## ఏపీ చరిత్రలో ఇవాళ మర్చిపోలేని రోజు

### కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ



విజయవాడ (విజయభాను న్యూస్) : ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఇవాళ మర్చిపోలేని రోజు అని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. విజయవాడ ఇందిరాగాంధీ మైదానంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న గడ్కరీ.. 30 జాతీయ రహదారి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. "ఆంధ్రప్రదేశ్ చాలా వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రం. ఇక్కడ వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు ఎంతో కీలకమైనవి. వ్యవసాయ రంగంలో ఏపీ వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఇక్కడి అభివృద్ధిలో పోర్టులది కీలక పాత్ర. గ్రామాల అనుసంధానతకు వాజ్‌పేయి అనేక చర్యలు తీసుకున్నారు. దేశాభివృద్ధికి గ్రామాల అనుసంధానం ఎంతో కీలకం అని వాజ్‌పేయి

తరువాయి 2లో..

## కేంద్ర ప్రభుత్వ సహకారంతోనే జాతీయ రహదారుల అభివృద్ధి

### ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



విజయవాడ: కేంద్ర ప్రభుత్వం సహకారంతో రాష్ట్రంలో జాతీయ రహదారులు అభివృద్ధి జరిగిందని ఏపీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రధాని మోదీ, కేంద్ర ఉపరితల రవాణా, జాతీయ రహదారుల అభివృద్ధి శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి సీఎం ధన్యవాదాలు తెలిపారు. విజయవాడ ఇందిరాగాంధీ మైదానంలో నిర్వహించిన కార్యక్రమంలో 30 జాతీయ రహదారి ప్రాజెక్టులకు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడారు.

**రాష్ట్రంలో రూ.10,600 కోట్లతో రోడ్ల అభివృద్ధి**

విజయవాడ బెంజి సర్కిల్ వద్ద రద్దీని దృష్టిలో ఉంచుకుని మరో ఫ్లైఓవర్ ఏర్పాటు చేయాలని 2019 ఆగస్టులో తాను



గడ్కరీకి విజ్ఞప్తి చేసినట్లు సీఎం తెలిపారు. ఆ మేరకు గడ్కరీ నిధులు మంజూరు చేయడంతో నిర్మాణ పనులు వేగవంతం చేశారని.. ఇప్పుడు ఫ్లైఓవర్ ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి అసంపూర్తిగా ఉన్న తూర్పు ఫ్లైఓవర్, కనకదుర్గ ఫ్లైఓవర్‌ను గడ్కరీ సహకారంతో వాయు వేగంతో అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల విస్తరణ, అభివృద్ధి, నిర్మాణానికి

తరువాయి 2లో..

# రూ.3,096 కోట్లతో టిటిడి బడ్జెట్‌కు ఆమోదం

**● త్వరలో ఆర్జిత సేవల పునరుద్ధరణ ● టిటిడి ధర్మకర్తల మండలి చైర్మన్ వైవి సుబ్బారెడ్డి**



తిరుమల తిరుపతి (విజయభాను న్యూస్) : తిరుమల తిరుపతి దేవస్థానం 2022 - 23 బడ్జెట్‌ను రూ.3,096.40 కోట్లతో ఆమోదించినట్లు టిటిడి చైర్మన్ శ్రీ వైవి సుబ్బారెడ్డి తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోవిడ్ - 19 నిబంధనలను సడలించిన నేపథ్యంలో త్వరలో కోవిడ్‌కు ముందులాగా శ్రీవారి ఆర్జిత సేవలు పునరుద్ధరించడంతో పాటు, సర్వ దర్శనం, శీఘ్ర దర్శనం టికెట్ల సంఖ్యను క్రమంగా పెంచాలని బోర్డు తీర్మానించినట్లు చెప్పారు.

తిరుమల అన్నమయ్య భవనంలో గురువారం టిటిడి పాలకమండలి సమావేశం జరిగింది. అనంతరం మీడియా సమావేశంలో చైర్మన్ ఆ వివరాలు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు టిటిడి ఆధ్వర్యంలో రూ.230 కోట్లతో శ్రీ పద్మావతి చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటి ఆసుపత్రి భవనాల నిర్మాణానికి ఆమోదం. ఆసుపత్రి భవన నిర్మాణాలు రెండు సంవత్సరాల్లోపు పూర్తి చేయాలని నిర్ణయం. ఇందుకు సంబంధించి త్వరలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డితో భూమిపూజ చేయించి టెండర్ల ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం. శ్రీ పద్మావతి హృదయాలయంకు అవసరమైన వైద్య పరికరాల కొనుగోలుకు టిటిడి జెఈవో ఆధ్వర్యంలో నిపుణుల కమిటీ ఏర్పాటు.

శ్రీ పద్మావతి హృదయాలయం ప్రారంభించి 100 రోజులలో 100 అపరేషన్లు నిర్వహించాం. తిరుపతిలో గరుడ వారధి

తరువాయి 4లో..

## ఏపీపీఎస్‌సీ చైర్మన్‌గా గౌతమ్ సవాంగ్



(ఫైల్ ఫోటో)

అమరావతి: మాజీ డీజీపీ గౌతమ్ సవాంగ్‌ను ఏపీ ప్రభుత్వం ఏపీపీఎస్‌సీ చైర్మన్‌గా నియమించింది. ఈ మేరకు గురువారం ప్రకటన వెలువడింది. రెండు రోజుల క్రితమే డీజీపీ పోస్టు నుంచి సవాంగ్ బదిలీ అయ్యారు.

# స్పందన ప్రజలు తృప్తిపరిచేలా వుండాలి



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : అర్జీలు పరిష్కారంలో అధికారులు మరింత శ్రద్ధ చూపాలని, ప్రజలందరూ తృప్తిపడేలా వుండాలని, వివిధ విభాగాల కార్యదర్శులు, ప్రత్యేక కార్యదర్శులు, రాష్ట్ర స్థాయి అధికారులు పేర్కొన్నారు. గురువారం ఉడా చిల్డ్రన్స్ ఎరీనాలో ఏర్పాటు చేసిన ఒక రోజు స్పందన వర్క్ షాప్ లో వారు మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే వినతులపై క్షుణ్ణంగా పరిశీలించి స్పందించాలని సూచించారు. చిరునవ్వుతో దరఖాస్తులు స్వీకరించాలని, ప్రజలు సంతృప్తి చెందేలా సమస్యలకు పరిష్కారం చూపాలని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి సాల్మన్ ఆరోగ్య రాజ్ మాట్లాడుతూ ఫిర్యాదు లేదా దరఖాస్తు పై క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి తగిన పరిష్కారం చూపాలన్నారు. అర్జీ దారు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలని వివరించారు. తరచు అర్జీలు పరిశీలిస్తూ వుంటే పూర్తి అవగాహన లభిస్తుందన్నారు. తహసీల్దార్ ఎంపిడిఓలు కలసి సచివాలయ సిబ్బంది తో టెలీకాన్ఫరెన్స్, వీడియో కాన్ఫరెన్స్ లు నిర్వహించాలన్నారు. అభివృద్ధి లో

తరువాయి 7లో..



# క్రీడాకారులకు అభినందనలు



గాజువాక : (విజయభాను న్యూస్): ఈనెల 13వ తేదీన తెలంగాణ రాష్ట్రం సికింద్రాబాద్ ఎల్బీ స్టేడియంలో జరిగిన అంతర్జాతీయ కరాటే పోటీలలో ప్రపంచవ్యాప్తంగా 3500 మంది కరాటే క్రీడాకారులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి 150 మంది వెళ్లారు, వారిలో విశాఖ నుంచి ఐదుగురు పాల్గొన్నారు. అందులో నలుగురు గోల్డ్ మెడల్ సాధించారు. దీంతో గెలుపొందిన క్రీడాకారులకు కిక్ బాక్సింగ్ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కరణంరెడ్డి నరసింగరావు చేతులమీదుగా గాజువాక తన క్యాంపు కార్యాలయంలో సర్టిఫికెట్స్ మెడల్స్ అందజేసి అభినందించారు. కమిటీలో బంగారు పతకం సాధించిన వారు ఎమ్. కృష్ణ చైతన్య , బి రితిక్ చంద్ర , వి ఆర్ సత్య సాయి , పి కిషోర్ వీరికి టీమ్ మేనేజర్ గా సీనియర్ కోచ్ ఎల్ బెన్నీ కుమార్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో కొత్తగాజువాక మండల అధ్యక్షులు గూటూరు. శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ సర్వమంగళ సమేత మృత్యుంజయేశ్వర స్వామి ప్రతిష్ట మహోత్సవం



గాజువాక : (విజయభాను న్యూస్ ): పెదగంట్యాడ గ్రామ ఆరాధ్య దేవత శ్రీ కుంచ మాంబ పున ప్రతిష్ట, శ్రీ గణపతి సుబ్రహ్మణ్య నవగ్రహ శ్రీ సర్వమంగళ సమేత మృత్యుంజయే శ్వర స్వామి ప్రతిష్ట మహోత్సవాన్ని మూడు రోజులపాటు విశిష్ట పూజలతో ఆలయ ధర్మకర్త మాజీ శాసనసభ్యులు తిప్పల గురుమూర్తి రెడ్డి సతీమణి వెంకట విజయ కుమారి దంపతులు చేతుల మీదగా గురువారం వైభవంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత 22 సంవత్సరాల క్రితం గ్రామదేవత శ్రీ కుంచ మాంబ అమ్మవారి ప్రతిష్ట జరిగిందని అనేక కారణాల వల్ల అమ్మవారి విగ్రహాన్ని పున ప్రతిష్ట ఈరోజు నుంచి 17.18. 19. మూడు రోజులపాటు శ్రీ గణపతి. సుబ్రహ్మణ్య నవగ్రహ.శ్రీ సర్వమంగళ సమేత మృత్యుంజయే శ్వర స్వామి ప్రతిష్ట మహోత్సవ నిర్వహిస్తున్నామని వారు అన్నారు.ఈ పూజా కార్యక్రమంలో గ్రామ మహిళలు. భక్తులు. గ్రామస్తులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వంపై సమాచార పోరాటం



గాజువాక : (విజయభాను న్యూస్ ): విశాఖ స్టీల్ ప్లాంట్ 100% వ్యూహాత్మక అమ్మకానికి వ్యతిరేకంగా స్టీల్ ప్లాంట్ 40వ ఫౌండేషన్ డే సందర్భంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి సంక్షిప్త సమాచారం (మెసేజ్)లు పంపాలని స్టీల్ సి ఐ టి యు అధ్యక్షులు కామ్రేడ్ జె అయోధ్య రామ్ పిలుపునిచ్చారు. ఉక్కు 40 ఫౌండేషన్ డే సందర్భంగా సి ఐ టి యు యూనియన్ తరపున ప్రతి ఒక్కరిని పేరుపేరునా అభినందించారు. గురువారం ఉక్కు నగరం యూనియన్ కార్యాలయంలో స్టీల్ సిఐటియు కార్యదర్శివర్గ సభ్యులు సమావేశంలో నిర్వహించారు.

ఈ సమావేశాన్ని ఉద్దేశించి జె అయోధ్య రామ్ మాట్లాడుతూ గడచిన సంవత్సర కాలంగా పోరాట కమిటీ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు నిర్వహించినా ప్రభుత్వ ఆలోచన మారలేదని ఆయన తీవ్రంగా విమర్శించారు. పోరాటాన్ని ఉధృతం చేయడంలో భాగంగా ఇప్పటికే అనేక జిల్లాలో సదస్సులు నిర్వహించి వారి మద్దతు కూడగట్టామని ఆయన అన్నారు. నేడు సాంకేతిక విప్లవం వల్ల పాలకుల విధానాల్లో మార్పు సాధ్యం అవుతున్న తరుణంలో ఈ ఉద్యమానికి శ్రీకారం చుట్టామని ఆయన వివరించారు. కనుక ఈ విప్లవం లో ప్రతి ఒక్కరినీ భాగస్వామ్యం చేయడం కోసం మనందరం కలసి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ప్రధాన కార్యదర్శి వైటి దాస్ మాట్లాడుతూ అమెరికాలో వాల్ స్ట్రీట్ ఉద్యమానికి ఈ సమాచార ఉద్యమమే ప్రధాన భూమికను పోషించింది అని ఆయన వివరించారు. ఈ సమాచారాన్ని మనము మరియు మన కుటుంబ సభ్యులతో మన స్నేహితులతో దీనిని ప్రధానికి మరియు కేంద్ర మంత్రులకు నేరుగా పంపడం ద్వారా ఉద్యమ తీవ్రతను పెంచడం సాధ్యమవుతుందని ఆయన వివరించారు. ప్రధాని ఈనెల 21 విశాఖ పర్యటనలో భాగంగా నిర్ణయాన్ని ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఈ సమావేశాల్లో స్టీల్ కార్యదర్శివర్గ సభ్యులు యు రామస్వామి, టి వి కె రాజు, నీలకంఠం, కె వి సత్యనారాయణ, బి.తౌడన్న, బి మహేష్, ఆర్ దుర్గా ప్రసాద్, వి డి వి పూర్ణచంద్రరావు, డి శ్రీనివాస్, కె. బాలశౌరి, ఎం ఎస్ వి ఉమామహేశ్వరరావు, డి కృష్ణ మూర్తి, పి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

# రూ. 209.00 లక్షలతో అభివృద్ధి పనులకు శంఖుస్థాపన



విశాఖపట్నం (విజయభాను న్యూస్ ):- రూ.198.00 లక్షల వ్యయంతో తారు రోడ్డు విస్తరణ మరియు కల్వర్టులు నిర్మాణ పనులకు, రూ.11.50 లక్షల వ్యయంతో వెల్లంపేట నందు సిసి రోడ్లు నిర్మాణం పనులకు రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక శాఖ మాత్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, పెందుర్తి శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజ్ తో కలిసి 8వ జోన్ పరిధిలోని 96వ వార్డు పులగానిపాలెం ప్రధాన రహదారిని(హనుమాన్ ఆలయం నుండి సూర్య నగర్

జంక్షన్ వరకు) 40 అడుగుల తారు రోడ్డు విస్తరణ మరియు కల్వర్టులు నిర్మాణం, సిసి రోడ్లు కొరకు రూ. 209.00 లక్షల వ్యయంతో నిర్మాణ పనులకు శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు మాట్లాడుతూ జివిఎంసి పరిధిలో ఉన్న ప్రతి వార్డుని పార్టీలకతీతంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి విశాఖ నగరాన్ని పరిపాలన రాజధానిగా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారని విశాఖ నగరం పర్యాటక రంగంగా అభివృద్ధి పరిచేందుకు నిధులు కేటాయించడం జరుగుతుందని తెలియజేశారు.

నగర మేయర్ మాట్లాడుతూ వార్డు అభివృద్ధి పథకంలో భాగంగా జివిఎంసి నిధుల నుండి రూ.209.00 లక్షల వ్యయంతో 96వ వార్డులో అభివృద్ధి పనులు చేయడం జరుగుతుందని తెలిపారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి విశాఖ నగరాన్ని ఆర్థిక రాజధానిగా ప్రకటించి అభివృద్ధి చేయుటకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించడం జరుగుతుందని, అలాగే కొత్తగా తారు రోడ్లు, సిసి రోడ్లు, రోడ్ల మరమ్మతులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. రానున్న రెండు నెలల్లోనే సుందర నగరంగా విశాఖను అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తున్నారు. అందులో భాగంగా వార్డు అభివృద్ధి ప్రణాళికలో వార్డులో ఉన్న అనేక సమస్యలను చేర్చి వార్డులోని ప్రజలకు కావలసిన మౌళిక వసతులు అంచలంచెలుగా పరిష్కరిస్తామని తెలిపారు.

ఎంతో అభివృద్ధి చెందుతున్న పెందుర్తి జోన్ లో స్థానిక శాసనసభ్యులు, కార్పొరేటర్ల సహకారంతో ఎక్కువ నిధులు కేటాయించి సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి చేయడం జరుగుతుందని తెలిపారు.

కౌన్సిల్ లో సభ్యులు తమ వార్డు సమస్యలను చెప్పుకునేందుకు సమయం సరిపోక పోవడంతో చాలామంది కార్పొరేటర్లు నిరాశకు గురవుతున్నారని, దీనిని అధిగమించడానికి కాఫీ విత్ కార్పొరేటర్ అనే వినూత్న కార్యక్రమం ద్వారా అధికారులతో సహా మీ జోన్ కే వస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, జివిఎంసి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**మొదటి పేజీ తరువాయి**

## కేంద్ర ప్రభుత్వ సహకారంతోనే జాతీయ రహదారుల అభివృద్ధి

అత్యంత చొరవతో ప్రభుత్వం ముందడుగు వేస్తోందని చెప్పారు. భూసేకరణ సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్రంలోని మిగిలిన రోడ్లను కూడా రూ.10,600 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామన్నారు.

**విశాఖ పోర్టు నుంచి భోగాపురం ఎయిర్‌పోర్టు వరకు..**

కేంద్ర ప్రభుత్వం చేసిన మంచి పనులపై ఎలాంటి రాజకీయాలు లేకుండా తమ సంతోషాన్ని వెలిబుచ్చుతున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి అవసరమైన మరిన్ని జాతీయ రహదారుల అభివృద్ధి పనులపై గడ్కరీ దృష్టికి తీసుకెళ్లారు. విశాఖ పోర్టు నుంచి భీమిలి, భోగాపురం ఎయిర్‌పోర్టు వరకు సముద్రతీరంలో ఆరులైన్ల రహదారి ఏర్పాటు చేసి దాన్ని 16వ నంబరు జాతీయ రహదారికి అనుసంధానించాలని జగన్ కోరారు. దీంతో పాటు విజయవాడ తూర్పు ప్రాంతంలో బైపాస్ రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించాలన్నారు. కడప జిల్లా భాకరాపేట నుంచి బద్వేలు, పోరుమామిళ్ల నుంచి బేస్తవారిపేట, సబ్బవరం నుంచి నర్సీపట్నం వరకు రోడ్లను అభివృద్ధి చేయాలని సీఎం విజ్ఞప్తి చేశారు.

**51 ప్రాజెక్టులు ముందడుగు**

కేంద్ర రోడ్డు, రవాణా, జాతీయ రహదారులశాఖ మంత్రి నితిన్ గడ్కరీ రాష్ట్ర పర్యటనలో భాగంగా మొత్తం 51 ప్రాజెక్టులకు సంబంధించి ముందడుగులు పడుతున్నాయి. ఇందులో రూ.10,400 కోట్ల వ్యయంతో నిర్మించిన 741 కిలోమీటర్ల పొడవైన 30 రహదారుల పనులకు శంకుస్థాపనతో పాటు, ఇప్పటికే రూ.11,157 కోట్ల వ్యయంతో పూర్తి చేసిన మరో 21 రహదారులను ఇవాళ ప్రారంభిస్తుండటం చాలా సంతోషంగా ఉంది.

ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్రమోదీ గారికి, ప్రత్యేకించి కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ గారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున ధన్యవాదాలు. విజయవాడ బెంజ్ సర్కిల్ వద్ద రద్దీను దృష్టిలో ఉంచుకుని మరో ఫ్లైఓవర్ నిర్మించాలని 2019 ఆగష్టులో నేను విజ్ఞప్తి చేశాను. ఆ మేరకు మంత్రి గడ్కరీ వెంటనే మంజూరు చేసి, 2020లోనే నిర్ణయం తీసుకుని,ఆ పై నిర్మాణ పనులు కూడా వేగవంతం చేసి.. ఆ ఫ్లైఓవర్‌ను కూడా గౌరవ కేంద్రమంత్రి ప్రారంభిస్తుండటం చాలా సంతోషం. గతంలో ఇదే విజయవాడలో 2019లో మనం అధికారంలోకి వచ్చేనాటికి కూడా పూర్తికాని బెంజ్ సర్కిల్‌లోని తూర్పున ఉన్న ఫ్లైఓవర్, కనకదుర్గమ్మ ఫ్లైఓవర్ మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే గడ్కరీ సహకారంతో వాయువేగంతో పూర్తి చేయగలిగామని సంతోషంగా చెపుతున్నాం.

**ప్రతి మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి కనెక్టవిటీ**

ప్రతి మండల కేంద్రం నుంచి కూడా జిల్లా కేంద్రం వరకు రెండు లైన్ల రోడ్లుగా మారుస్తూ... దాదాపుగా రూ.6,400 కోట్లు ఖర్చు చేయబోతున్నాం. పూర్తిగా రోడ్లన్నీ కూడా రిపేర్లు, మెయింటైనెన్స్ చేయడం కోసం మాత్రమే మరో రూ.2300 ఖర్చు చేస్తున్నాం. పెండింగ్‌లో ఉన్న ప్రతి రోడ్డు పూర్తి చేసేందుకు మరో రూ.1700 కోట్లు ఖర్చుతో కలిపి రూ.10,600 కోట్లకు సంబంధించిన రహదారి పనులకు శ్రీకారం చుట్టాం.

ఇందులో కొన్ని పనులు ఇప్పటికే ప్రారంభం అయ్యాయి. ఇక రాష్ట్రానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం తరపున మీరు చేసిన మంచి పనులన్నింటికీ కూడా ఎటువంటి సంకోచం లేకుండా, ఎటువంటి రాజకీయాలు లేకుండా ప్రజల మందుర మీకు మా సంతోషాన్ని, కృతజ్ఞతలూ తెలియజేస్తున్నాను. ఇవాళ మరికొన్ని రోడ్ల నిర్మాణం కూడా ఈ రాష్ట్రానికి అత్యంత అవసరమని విజ్ఞప్తి చేస్తూ.. మీ ఆమోదం కోసం కొన్ని ప్రతిపాదనలను మీ ముందు ఉంచుతున్నాను. ఈ ప్రతిపాదనలన్నింటినీ ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం తరపున కేంద్ర రోడ్డు, రవాణా, జాతీయరహదారుల శాఖకు పంపించాం. గడ్కరీ దయచేసి వీటన్నింటినీ పరిశీలించి, పరిష్కరిస్తారని ఆశిస్తున్నాను. మరోవైపు జాతీయ ప్రయోజనాల దృష్ట్యా ఇటీవలే రాష్ట్ర రహదారులపై ఆర్‌ఓబీల నిర్మాణాలకు సంబంధించి కేంద్రం అడిగిన 20 ప్రతిపాదనలు సిద్ధం చేశాం. దీనికి సంబంధించి కూడా త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలని కోరుతున్నాం. వీటన్నింటితో పాటు మంచి చేస్తున్న మంచి వారికి ఎప్పుడూ మంచి జరగాలని ఆశిస్తూ.. కోరుకుంటూ దేవుడి దయ, ప్రజలందరి చల్లని దీవెనలు కూడా మనందరి ప్రభుత్వానికి కూడా ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నానని సీఎం జగన్ తన ప్రసంగం ముగించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రులు ధర్మాన కృష్ణదాస్, కె నారాయణస్వామి, పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## ఏపీ చరిత్రలో ఇవాళ మర్చిపోలేని రోజు

భావించారు. అభివృద్ధి విషయంలో కేంద్రం ఎవరిపైనా వివక్ష చూపించదు. కేంద్రం అన్ని రాష్ట్రాలకు సమాన ప్రాధాన్యత ఇస్తుంది. ఏపీలో రోడ్ల అభివృద్ధికి రూ.3 లక్షల కోట్లను కేటాయిస్తాం. ఏపీలో 3 గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేలు నిర్మిస్తున్నాం. 2024లోగా రాయ్‌పూర్-విశాఖ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే అందుబాటులోకి తీసుకొస్తాం. నాగ్‌పూర్-విజయవాడ, బెంగళూరు-చెన్నై మధ్య గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేలు నిర్మిస్తాం. రూ.5వేల కోట్లతో చిత్తూరు-తంజావూర్ ఎక్స్‌ప్రెస్ హైవేని పూర్తి చేస్తాం" అని గడ్కరీ వెల్లడించారు.

కాలుష్యం తగ్గించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు గడ్కరీ తెలిపారు. పెట్రోల్, డీజిల్‌కు బదులుగా వాహనాల్లో సీఎన్‌జీ, ఎల్‌ఎన్‌జీ వాడాలని సూచించారు. భవిష్యత్‌లో గ్రీన్ హైడ్రోజన్ వినియోగాన్ని ప్రోత్సహిస్తామన్నారు. ఈ దేశంలో రైతులు కేవలం అన్నదాతలే కాదని.. విద్యుత్ ఉత్పత్తిదారులుగా మారతారని పేర్కొన్నారు. ఇథనాల్, గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి దిశగా, బయో ఇంధనాల ఉత్పత్తికి ఏపీ మరిన్ని చర్యలు తీసుకోవాలని కోరారు. లాజిస్టిక్ పార్కుల కోసం రాష్ట్ర భూమి కేటాయించాలని సీఎం జగన్‌ను కోరారు. ఏపీ 20 ఆర్‌వోబీలు అడిగితే.. కేంద్రం 30 ఆర్‌వోబీలు మంజూరు చేసిందని నితిన్ గడ్కరీ వెల్లడించారు.

## గుమ్మలక్ష్మీపురం ఘటనపై మంత్రి సీరియస్..

### ఇద్దరు ఉపాధ్యాయుల సస్పెన్షన్

విజయనగరం: గుమ్మలక్ష్మీపురం మండలం బాలేసు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ ఘటనపై విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయుడు స్వామి నాయుడు, ఉపాధ్యాయుడు సూర్యనారాయణను తక్షణమే విధుల నుంచి తప్పించి విచారణకు ఆదేశించారు. విచారణ తర్వాత క్రిమినల్ కేసు నమోదుకు కూడా మంత్రి ఆదిమూలపు సురేష్ ఆదేశించారు.

## ఫుడ్‌సైన్స్‌లో పరిశోధనకు గీతం పిహెచ్‌డి అవార్డు

విశాఖపట్నం (విజయభాను న్యూస్):- సూక్ష్మ పోషకాలను బిస్కెట్‌ల తయారీలో ఉపయోగించడం వల్ల కలిగే ప్రయోజనాలపై పరిశోధన జరిపినందుకు గాను గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం మైక్రోబయోలజీ, ఫుడ్ సైన్స్ టెక్నాలజీ పరిశోధకురాలు డాక్టర్ పూజా మాండలిక్‌కు పిహెచ్‌డి అవార్డును ప్రకటించినట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ తెలిపారు. విభాగం సీనియర్ ప్రొఫెసర్లు ప్రొఫెసర్ కె.అరుణలక్ష్మి, డాక్టర్ ఎల్.అనిత మార్గదర్శకంలో తన పరిశోధనలు జరిపినట్లు డాక్టర్ పూజా మాండలిక్ తెలిపారు. స్థానికంగా లభించే చిరు ధాన్యాలతో పోషక విలువలు గల బిస్కట్‌ల తయారీ ప్రత్యామ్నాయంగా ఉపయోగపడగలదన్నారు. మార్కెట్‌లో లభించే బిస్కట్‌లలోని పోషక విలువల కంటే స్థానికంగా లభించే చిరుధాన్యాలలోని పోషకాలు అధికమన్నారు.

## హిజాబ్ వివాదంపై స్పందించిన లయోలా కళాశాల ప్రిన్సిపల్

విజయవాడ : హిజాబ్ వివాదంపై విజయవాడ ఆంధ్రా లయోలా కళాశాల యాజమాన్యం స్పందించింది. కళాశాల ప్రిన్సిపల్ కిషోర్ మీడియాతో మాట్లాడారు. "ఇద్దరు విద్యార్థినులు ఇవాళ హిజాబ్ ధరించి కళాశాలకు వచ్చారు. తరగతి గదుల రౌండ్స్‌కు వెళ్తున్నప్పుడు వారిని గమనించాను. కళాశాలకు హిజాబ్ ధరించి వస్తున్నారేంటని ప్రశ్నించా. అనంతరం విద్యార్థినుల తల్లిదండ్రులు నా వద్దకు వచ్చారు. కళాశాలలో చేరేటప్పుడే నిబంధనలపై సంతకం చేశారు. కలెక్టర్ ఆదేశాలతో తరగతి గదిలోకి అనుమతించాం. రేపటి నుంచి హిజాబ్ ధరించి రావాలా వద్దా అనేది నిర్ణయిస్తాం" అని ప్రిన్సిపల్ కిశోర్ అన్నారు. ఈ ఉదయం ఇద్దరు బీఎస్సీ ఫైనల్ ఇయర్ విద్యార్థినులు హిజాబ్ ధరించి కళాశాలకు వచ్చారు. వారిని చూసిన ప్రిన్సిపల్ హిజాబ్‌తో ఎందుకొచ్చారని.. దుస్తులు మార్చుకొని రావాలన్నారు. దీంతో విద్యార్థినులు




తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ముస్లిం మత పెద్దలతో పాటు తల్లిదండ్రులు, పోలీసులు ప్రిన్సిపల్‌తో మాట్లాడారు. అనంతరం విద్యార్థినులను తరగతి గదుల్లోకి అనుమతించిన విషయం తెలిసిందే.

# కొండకర్ల ఆవలో ఆహ్లాదకరమైన వాతావరణం



అచ్యుతాపురం (విజయభాను న్యూస్) : కొండకర్ల ఆవలో ఆహ్లాద కరమైన వాతా వరణం నెలకొందని అనకాపల్లి పోస్టల్ డివిజన్ సూపరిం డెంట్ జె ప్రసాద్ బాబు చెప్పారు. కొండకర్ల ఆవలో గురువారం ఫైబర్ బోట్ పై ఆయన సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆవలో అందాలను ఆయన తిలకించారు. అనం తరం కొండకర్ల బ్రాంచ్ పోస్ట్ ఆఫీస్ లో సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహిం చారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరు తప్పనిసరిగా లక్ష్యం నెరవేరేలా పనిచేయాలన్నారు. 10 సంవత్సం ాలలోపు ఆడపిల్లలకు ఉపయోగపడేలా ప్రధానమంత్రి ప్రవేశపెట్టిన సుకన్య సమృద్ధి యోజన అకౌంట్లను ప్రతి ఒక్కరికి తెలియజేయాలన్నారు. సమీక్షా సమావేశంలో అనకాపల్లి సబ్ డివిజన్ ఇన్స్ పెక్టర్ ఎస్ కే శివ, మెయిల్ ఓవర్ సీర్ శ్రీనివాస్ రెడ్డి, మరియు మునగపాక, పరవాడ, అచ్యుతాపురం, తపాలా ఆఫీసుల బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ లు, ఏబియంలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్స్ వనుము చిట్టబ్బాయి, కళాశాల సిబ్బంది సొంత నిధులతో

# కళాశాల బౌండరీ , కాపాడుకునేందుకు కంచె (పిన్సింగ్)



పాడేరు:(విజయభాను)స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల 27 ఎకరాల 50 సెంట్లు భూమిని కాపాడుకోవడం కోసం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వనుము చిట్టబ్బాయి, కళాశాల సిబ్బంది సొంత నిధులతో కాలేజీ బౌండరీ కంచె (పిన్సింగ్)వేస్తున్నారు. పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల 27 ఎకరాల 50 సెంట్లు భూమి అన్యాక్రాంతం అవుతుండడంతో, కాలేజీ పరిసరాలలో ఆకతాయిలు ఎక్కువ కావడంతో డిగ్రీ కళాశాల భూమిని కాపాడుకుంటూ, కళాశాల పరిస రాలలో ఆకతాయి లను అడ్డుకట్ట వేయాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ , కళాశాల సిబ్బంది చొరవ తీసుకొని మంచి కార్యక్రమం చేస్తున్నారని డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థులు కూడ రాధాకృష్ణ , బూడిద సుమన్, పిట్ట నరేష్ సహకరించారు.

ఈ కార్య క్రమంలో కళాశాల సిబ్బంది ఎన్,ఎస్,ఎస్. కోఆర్డినేటర్ గౌరీశంకర్ , కూన అప్పల నాయుడు, డిగ్రీ కళాశాల వార్డెన్లు జన్ని జగత్ రాయ్, తిరుపతి రావు, కళాశాల అధ్యాపకులు పులి కోటేశ్వరరావు ,అచ్యుత రావు ధర్మారావు ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు: అంగనైని ఆనంద్, కామరాజు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి

## జనసేన సాయిబాబా, దురియా





అరకులోయ (విజయభానున్యూస్) : మండలంలోని, ఇరాగాయి పంచాయతీ పరిధిలో గల బొందు గూడా గ్రామంలో గురువారము జనసేన పార్టీ ఎక్స్ ఎంపిటిసి సాయిబాబా ఆధ్వ ర్యంలో అయ గ్రామంలో ఇంటింటికి జనసేన మాటలు ప్రజల్లోకి తీసుకెళ్లారు, అనంతరం గ్రామస్తులతో సమావేశంమై నా సాయిబాబా గ్రామంలో నెలకొన్న సమస్యల పట్ల చర్చించారు, అనంతరం సాయిబాబా మాట్లాడుతూ

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలు సమస్యలను పట్టించుకునే పరిస్థితి లేదని, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తోందని, ఇచ్చిన హామీలను తుంగలో తొక్కేసి, జగన్ రెడ్డి ప్రభుత్వం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ప్రభు త్వంపై మండిపడుతునే, ప్రభుత్వ విధానాలను ప్రజల్లోకి తీసు ెళ్లారు, ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి గిరిజనులకు ఇచ్చినటు వంటి హామీలను నెరవేర్చాలని లేని పక్షాన రానున్న రోజుల్లో

జనసేన పార్టీ ఆధ్వర్యంలో మనమందరం కలిసి వైయస్సార్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని గ్రామ ప్రజలను సూచిం చారు, ఈ కార్యక్రమంలో జనసైనికులు, శ్యాంసుందర్, రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సమ్మక్క, సారక్క జాతరలో అరకు ఎంపీ మాధవి దంపతులు



హాజరైన ఎంపీ మాధవి దంపతులు

కొయ్యూరు (విజయభాను న్యూస్) : ఆదివాసుల వనదేవతల జాతర పండుగ, మేడారం సమ్మక్క సారక్క జాతరలో అరకు ఎంపి గొడ్డేటి మాధవి, శివప్రసాద్ దంపతులు హాజరయ్యారు. ఆసియా ఖండంలో జరిగే అతి పెద్ద ఆదివాసీ మహాసమ్మేళనంగా ప్రసిద్ధి చెందిన, తెలంగాణా రాష్ట్రంలోని ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో మేడారం సమ్మక్క సారమ్మ జాతరలో కుటుంబ సమతేంగా పాల్గన్నారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ మా ఆదివాసీ పండుగ సందర్భంగా ఇక్కడ విచ్చేయడం ఆనందంగా ఉందన్నారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సక్రమంగా ఏర్పాట్లు చేశామని ఆలయ సిబ్బందికి కొనియాడారు. ఈ కార్యక్రమంలో యువనేత గొడ్డేటి మహేష్, గిరీ, కుమార్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక శాసనసభ్యులు చెట్టి ఫాల్గుణ పై నిందలు తగదు

## మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కొర్ర సూర్యనారాయణ

అనంతగిరి (విజయభాను న్యూస్): స్థానిక ఎమ్మెల్యే పాల్గుణ పై అనవసర నిందలు ఆరోపణలు చేయటం ప్రత్యర్థులకు తగదని వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుర్ర సూర్యనారాయణ అన్నారు.ఎమ్మెల్యే ఎదుగుదలను చూసి ఓర్వలేక కొందరు ఆయనపై అనవసరం నిందలు ఆరోపణలు చేస్తున్నారని తగిన ఆధారాలు లేని నిందలు వేసి ఆయనను చేయాలనుకోవడం తగదని చెప్పారు ఎమ్మెల్యే తన సొంత వర్గానికి మాత్రమే అన్నింటిలో పెద్దపీట వేస్తున్నారని అనవసరం ప్రచారాలు చేయటం ఎంతవరకు సబబని ప్రశ్నించారు.

నేడు ఒక జిల్లా పరిషత్ చైర్పర్సన్ ఎస్టీ కమిషన్ మెంబర్ ఇలాంటి ఉన్నతమైన పదవులు ఏ కులాల వారికి కట్టబెట్టారు ప్రతి ఒక్కరికి తెలుసు అని చెప్పారు అయినప్పటికీ అనవసరపు ఆరోపణలు చేసి ఎమ్మెల్యే బురద జల్లి కార్యక్రమం చేపడితే ఉపేక్షించేది లేదని చెప్పారు.

# నేత్రపర్వంగా అప్పన్న స్వర్ణ పుష్పార్చన





సింహాచలం (విజయభాను న్యూస్): శ్రీ శ్రీ శ్రీ వరాహలక్ష్మీనృసింహ స్వామి స్వర్ణ పుష్పార్చన నేత్రపర్వంగా సాగింది. ఆర్జిత సేవల్లో భాగంగా ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో కల్యాణ మండ పంలో అధిష్టింపజేశారు.

అప్పన్న వారికి 108 స్వర్ణ పుష్పలతో వేద పండితులచే వేదమంత్రాల నాదస్వర మంగళ వాయిద్యాల నడుమ స్వర్ణ పుష్పార్చన కార్యక్రమం నిర్వహించారు పాల్గొన్న భక్తుల గోత్రనామా లతో సంకల్పం చెప్పి పాంచరాత్రాగమశాస్త్రం విధానంలో విశ్వక్సే నారాధన పుణ్యాహవచనాలతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కమనీయంగా జరిపించారు తర్వాత భక్తులకు వేదాశీర్వచలు శేషవస్త్రాలు, స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

# పజారంజక పాలన అందిస్తున్న జగన్మోహన్ రెడ్డి పాలనలో ఎవరికీ ఇబ్బందులుండవు

## జివియంసి 35 వార్డ్ కార్పొరేటర్ విల్లూరి భాస్కర రావు



అక్కయ్యపాలెం (విజయభానున్యూస్) : ప్రజారంజక పాలన అందిస్తున్న జగన్మోహన్ రెడ్డి పాలనలో ఎవరికీ ఇబ్బందులుండవని జీవీఎంసీ 35 వార్డ్ కార్పొరేటర్ విల్లూరి భాస్కర రావు అన్నారు.గురువారం రోజువారీ వార్డు పర్యటనలో భాగంగా లక్ష్మీనగర్ వేలంపేట పోస్ట్ ఆఫీస్ ఎదురుగా సుమారు 60 ,70 ఏళ్లుగా కాలువలతో ఎన్నో ఇబ్బదులు పడుతున్న పరిస్థితిని గమనించిన విల్లూరి వార్డు పబ్లిక్ వర్క్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్,సుధా లకు పరిస్థితిని వివరించి తక్షణమే కార్పొరేటర్ అభివృద్ధి నిధులు ఐదు లక్షల రూపాయలతో డ్రైనేజీ,కాలువలు పునర్మించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా విల్లూరి మాట్లాడుతూ వార్డుప్రజల సంక్షేమమే తనకు ముఖ్యమన్నారు. వార్డు అభివృద్ధికి జీవీఎంసీ మేయర్,కమిషనర్,ఇతర అధికారుల సహకారం తీసుకుంటా నన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి, రాజ్యసభసభ్యుడు విజయసాయిరెడ్డి ల స్ఫూర్తితో విశాఖలో తమ వార్డును అతి సుందరంగా తీర్చిదిద్దాలన్నదే తన ముందున్న ఏకైక లక్ష్యమని విల్లూరి పేర్కొన్నారు.

# శ్రీ శ్రీ నూకాలమ్మ వారి దేవాలయం

## ట్రస్ట్ బోర్డు కమిటీ చైర్మన్, మెంబర్లు ప్రమాణ స్వీకారం



భీమునిపట్నం (విజయభాను న్యూస్) : భీమిలి గ్రామ దేవతశ్రీ శ్రీ శ్రీ నూకాలమ్మ వారి గుడి వద్ద రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి. శ్రీనివాసరావు ఆధ్వ ర్యంలో శ్రీ శ్రీ శ్రీ నూకాలమ్మ వారి దేవాలయం ట్రస్ట్ బోర్డు కమిటీ ప్రమాణ స్వీకారం కార్యక్రమం నిర్వహించారు.శ్రీ శ్రీ శ్రీ నూకాలమ్మ వారి ట్రస్ట్ బోర్డు కమిటీ చైర్మన్ వాసుపల్లి కొండబాబు,కమిటీ మెంబర్లు గా పిన్నింటి ఎర్రయ్య రెడ్డి, ముక్కి కృష్ణ,కందివలస స్నేహలత, గుర్ల శారద కుంకుపూడి నూకరత్నం, .ధవల అరుణ లు చేత ప్రమాణ స్వీకారం చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రస్ట్ సభ్యులు అందరూ కలిసి కట్టు గా పని చేసి దేవాలయం నీ అభివృద్ధి చేయాలని. అన్నారం .రాబోయే రోజుల్లో ఆ తల్లి అనుగ్రహం తో భీమిలి నీ అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో. ఇ. వో. కీర్తి శ్రీనివాస రావు,డి ఎల్ డీ ఏ చైర్మన్ మరియు భీమిలి జెడ్పీ టీ సి గాడు వెంకటప్పడు, ఎం.పి.పి.వాసురాజు,వైస్ ఎం పి పి బోని బంగారు నాయుడు, ఒకటి నాలుగు వార్డ్ ల కార్పొరేటర్ లు అక్కరమాని పద్మావతి రామునాయుడు, డి.ఏడు కొండలు , మైలపల్లి. షణ్ముఖ రావు, చిల్ల వంశీరెడ్డి, అల్లిపిల్లి. నరసింగరావు, ఆలయ పూజారి చౌదరీ సత్యరాజు తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయ సిబ్బందికి యూనిఫాం అందజేత



గొలుగొండ (విజయభాను న్యూస్) : గొలుగొండ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి గజ్జల మణికుమారి, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు ఆధ్వర్యంలో 20 సచివాలయంలో పని చేస్తున్న 162 మంది సిబ్బందికు ప్రభుత్వ నుంచి వచ్చిన యూనిఫాంలు పంపిణీ చేశారు. రామచంద్ర నాయుడు,ఎంపిటిసి రుత్తల రామకృష్ణ, స్వామినాయుడు పాల్గొన్నారు.


GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION

| S.No | Tender Notice No. | No of Works | Value of Works(ECV) | Tender Opening Dt | Closing Date | Contact No |
|---|---|---|---|---|---|---|
| 1 | SH.T.N.No.24/2021-22/E.E-II(WS-M)/DB/ Dt:05-01-2022 | 1 Work | Rs.17.47 Lakhs | 05-01-2022 | 12-01-2022 | 9948078503 |
| | T.N.No.24/2021-22/E.E-II(WS-M)/DB/Dt:05-01-2022 | 8 Works | Rs.106.25 Lakhs | 05-01-2022 | 20-01-2022 | 9948078503 |
| 2 | T.N.No.54/2021-22/EE-II(Works)/DB, Dt:05-01-2022 | 24 Works | Rs.3,65,57,302.00 | 07-01-2022 | 24-01-2022 | 9948525297 |
| 3 | T.N.No.55/2021-22/EE-II(Works)/DB, Dt:06-01-2022 | 13 Works | Rs.2,02,23,455.00 | 10-01-2022 | 27-01-2022 | 9948525297 |

Note: Further details at http://www.tender.apeprocurement.gov.in For Commissioner

# విజయభాను

## సంపాదకీయం

### పెట్టడం- నవతరం భవితకు బంగరుబాటలు

రేపటి ఉద్యోగాలకు అత్యవసరమైన నైపుణ్యాలను గుర్తించడం, నేటి విద్యార్థుల్లో వాటికి ప్రాదిచేసేలా కార్యాచరణ రూపొందించడం, ఆ మేరకు పిల్లల సామర్థ్యానికి పదును పెట్టడం- నవతరం భవితకు బంగరుబాటలు వేసే విశిష్ట విధానాలివి. సింగపూర్, జర్మనీ ప్రభృత దేశాలు ఆ మేరకు ప్రత్యేక కార్యక్రమాలతో తమ విద్యార్థులను ప్రణాళికాబద్ధంగా సానపడు తున్నాయి. తద్భిన్నంగా కాలంచెల్లిన పాఠ్యప్రణాళికలతో దేశీయంగా చదువులు చట్టుబండలవుతున్నాయి. భారతీయ పరిశ్రమల సమాఖ్య భాగస్వామ్యంతో 'వీబాక్స్' సంస్థ వెలువరించిన 'ఇండియా నైపుణ్యాల నివేదిక-2021' ప్రకారం- దేశవ్యాప్తంగా నూతన ఎంసీఏ పట్టభద్రుల్లో ఉద్యోగాలు సాధించగలిగిన సమర్థులు కేవలం 22శాతం. పాలిటెక్నిక్ పరిస్థితీ అధ్వానమే! దాన్ని పూర్తిచేస్తున్న వారిలో మూడొంతుల మంది తగిన నైపుణ్యాలను ఒడిసిపట్టలేకపోతున్నారు. ఎంబీఏ, ఇంజినీరింగ్ విద్యార్థుల్లో సగంమందికి పైగా సామర్థ్యాల లేమితో ఉద్యోగాల సాధనలో వెలాతెలాపోతున్నారు. 'భారతరత్న' సీఎన్ఆర్ రావు గతంలో ఉద్ఘాటించినట్లు- పాఠ్యాంశాల నవీకరణలో చురుగ్గా వ్యవహరించని విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యాసంస్థలదే ఈ పాపం! పాఠ్యపుస్తకాల నుంచి పరీక్షల నిర్వహణ వరకు మేటవేసిన పలు సమస్యలతో బడి చదువులూ అదే తీరుగా వట్టిపోతున్నాయన్నది యథార్థం. కొవిడ్ మహమ్మారి విజృంభించి విద్యాప్రమాణాలు మరీ దిగనాసిపోయిన దుస్థితిలో... 2022-23 విద్యాసంవత్సరానికి బోధనా ప్రణాళికల హేతుబద్ధీకరణకు జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) సమాయత్తమవుతోంది. సంక్షోభ సమయంలో పిల్లలపై భారం తగ్గించేందుకు పాఠ్యపుస్తకాల్లో మార్పులుచేర్పులు చేయాలని ఆ సంస్థ తాజాగా నిశ్చయించింది. తరగతి గదిలో మూసవిధానాల దుష్ఫలితంగా భారతీయ విద్యార్థుల్లో అత్యధికులు జ్ఞానార్జనలో విఫలమవుతున్నారని యునిసెఫ్ లోగడే హెచ్చరించింది. దేశాభివృద్ధికి విఘాతకరమైన ఆ దురవస్థ తొలగిపోవాలంటే- అన్ని స్థాయుల పాఠ్యప్రణాళికలూ ఎప్పటికప్పుడు నవ్యతను సంతరించుకోవాలి. మార్కులు, ర్యాంకులే లక్ష్యంగా సాగే బట్టీ చదువుల్ని వదిలిపెట్టి భావితరానికి జీవన నైపుణ్యాలను అందించే మేలిమి విద్యావ్యవస్థను కొలువుతీర్చాలి! చిన్ననాటి నుంచే వృత్తివిద్యలను బోధిస్తే, ఏ దశలో చదువుకు దూరమైనా పిల్లలు తమ కాళ్లపై తాము నిలబడగలరన్నది మహాత్ముడి మేలిమి సూచన. దశాబ్దాలుగా దాన్ని నిర్లక్ష్యం చేసిన పాలకుల పుణ్యమా అని దేశీయ యువశక్తి నీరుగారిపోతూ, నిరుద్యోగ భూత కబంధ హస్తాల్లో విలవిల్లాడుతోంది. సమగ్ర శిక్షా పథకం కింద దేశవ్యాప్తంగా 14 వేలకు పైగా పాఠశాలల్లో దాదాపు 16 లక్షల విద్యార్థులకు వృత్తివిద్యా బోధన కొనసాగుతోందని కేంద్ర ప్రభుత్వం ఇటీవల లోక్‌సభలో ప్రకటించింది. దేశీయంగా మొత్తం బడిపిల్లల సంఖ్య(పాతిక కోట్ల మందికి పైగానే)తో పోలిస్తే అది చాలా స్వల్పం. పాఠశాలల్లో వృత్తివిద్యలను సమధికంగా ప్రోత్సహిస్తూనే- డిగ్రీ విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ఉద్దేశించిన 'జీవన్‌కౌశల్' ప్రణాళికను పూర్తిస్థాయిలో పట్టాలకు ఎక్కించాలి. 21వ శతాబ్ది నైపుణ్యాలైన సృజనాత్మకత, విమర్శ నాత్మక బుద్ధి కుశలత, సాంకేతిక ప్రజ్ఞ, సంభాషణ, సమస్యా పరిష్కార సామర్థ్యాలను విద్యార్థుల్లో ఇనుమడింపజేసేలా పాలకుల కార్యాచరణ పదునుతేలాలి. 2030 నాటికి 30 కోట్ల మంది భారతీయ యువతీ యువకులకు నైపుణ్య శిక్షణ అందించేందుకు ప్రైస్‌వాటర్‌కూపర్స్, యునిసెఫ్ ఇటీవల ముందుకొచ్చాయి. కనీస మౌలిక వసతులు, ఉపాధ్యాయుల కొరతతో కునారిల్లుతున్న పాఠశాలల స్థితిగతులు సత్వరం మెరుగు పడితేనే విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పునాదులు పటిష్ఠ మవుతాయి. అంతర్జాతీయ శక్తిగా భారతదేశం వెలుగు లీనాలంటే- చదువుల్లో సమూల సంస్కరణలకు శ్రీకారం చుట్టి, భావి తరాన్ని నిపుణ మానవ వనరులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వాలు ముందడుగు వేయాల్సిందే!

# విద్యా వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం

**- స్పీకర్ తమ్మినేని**



ఆమదాలవలస : పిల్లలు ప్రయోజకులు కావాలంటే ముందుగా విద్యా పునాది బలంగా ఉండాలని రాష్ట్ర శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. అందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విద్యా వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టారని సీతారాం అన్నారు. జాతీయ విద్యా విధానం పై ఆమదాలవలస మున్సిపల్ పరిధిలోని ఎస్.ఎస్.ఎన్ కళ్యాణ మండపంలో మండల విద్యాశాఖ అధికారి కృష్ణా రావు అధ్యక్షతన సమావేశానికి ముఖ్య అతిథిగా శాసన సభ స్పీకర్ పాల్గొన్నారు. స్పీకర్ తమ్మినేని మాట్లాడుతూ సమావేశంలో అందరి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటుందని వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా మ్యాపింగ్ జరుగుతుందని అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆశయానికి అనుగుణంగా పని చేయాలన్నారు. శాస్త్రీయ సాంకేతిక పరిజ్ఞానం పెరిగిపోయిందని, అభివృద్ధి చెందుతున్న నాగరికత వైపు అడుగులు వేయాలని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పేదరికం పోవాలని, జీవన ప్రమాణాలు పెరగాలని సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు అనుగుణంగా పాలన సాగిస్తున్నారని ఆయన వివరించారు. రానున్న రోజుల్లో ఆంధ్రప్రదేశ్ ని అన్ని రంగాల్లో ముందు వరుసలో నిలబెడతారని స్పీకర్ తమ్మినేని అన్నారు. తొగరాం సర్పంచ్ తమ్మినేని వాణి సీతారాం మాట్లాడుతూ సర్పంచులు, ఉపాధ్యాయులు ముఖ్యంగా మీ పాఠశాల పరిధిలో ఉన్న వాస్తవిక పరిస్థితులను మీ సమస్యలను గుర్తించాలని కోరారు. పాఠశాలల మ్యాపింగ్ పూర్తయితే ప్రభుత్వం ఆమోదిస్తుందని, ప్రతి ఒక్కరూ స్పష్టమైన అభిప్రాయాలను తెలియజేయాలని ఆమె కోరారు. ప్రతి గ్రామంలో ఉపాధ్యాయులు, సర్పంచులు కలిసి పిల్లల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పరచి వారికి అర్థమయ్యే విధంగా విద్య విధానం పై అవగాహన కార్యక్రమం చేపట్టాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో పద్మావతి, ఎంపీడీవో రేణుక, మున్సిపల్ కమిషనర్ రవి సుధాకర్,జడ్పిటిసి బెండి గోవిందరావు, వైస్ ఎంపీపీ సోమరాజు., తమ్మినేని చిరంజీవి నాగ్, తమ్మినేని శ్రీరామమూర్తి, జగన్నాధ రావు, సర్పంచులు ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

# కీలక ప్రాజెక్టులపై కేంద్రమంత్రి గడ్కరీతో సీఎం జగన్ చర్చ



అమరావతి: పూర్తయిన పలు జాతీయ రహదారుల ప్రాజెక్టులకు ప్రారంభోత్సవం, వివిధ ప్రాజెక్టులకు శంకుస్థాపనల తర్వాత కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ నేరుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నివాసానికి చేరుకున్నారు. కేంద్ర మంత్రి గౌరవార్థం ఆయనకు సీఎం విందు ఇచ్చారు. భోజనం తర్వాత రాష్ట్రానికి సంబంధించిన పలు ప్రాజెక్టులు, ప్రతిపాదనలపై నితిన్ గడ్కరీతో సీఎం చర్చించారు. ఈ సమావేశంలో కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖకు చెందిన అధికారులు, రాష్ట్రానికి చెందిన కీలక అధికారులు హాజరయ్యారు.

రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని గొప్పస్థాయికి తీసుకెళ్లగలిగే విశాఖపట్నం-భీమిలి-భోగాపురం (బీచ్ కారిడార్) రోడ్డుపై విస్తృత చర్చజరిగింది. రాష్ట్రాభివృద్ధిలో ఈ రోడ్డు కీలక పాత్ర పోషిస్తుందని, టూరిజం రంగం బాగుపడ్డమే కాకుండా చాలామందికి ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ముఖ్యమంత్రి.. కేంద్రమంత్రికి వివరించారు. విశాఖ నగరం నుంచి త్వరలో నిర్మాణం కానున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి త్వరగా చేరుకోవాలన్నా ఈ రహదారి అత్యంత కీలకమని సీఎం వివరించారు. ఈ ప్రాజెక్టుపై సానుకూలత వ్యక్తం చేసిన కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ప్రఖ్యాత అంతర్జాతీయ కన్సల్టెన్సీతో ప్రతిపాదనలు తయారు చేయించాలని సూచించారు. దీనిపై వెంటనే తగిన చర్యలు తీసుకుంటామని సీఎం వైఎస్ జగన్, గడ్కరీతో అన్నారు. విజయవాడలో ట్రాఫిక్ కష్టాలను తగ్గించడానికి ఇప్పుడు నిర్మాణం అవుతున్న పశ్చిమ బైపాస్‌తో పాటు తూర్పున మరో బైపాస్ నిర్మాణం కూడా చేయాలని ముఖ్యమంత్రి చేసిన విజ్ఞప్తిపై కేంద్రమంత్రి అంగీకారం తెలిపారు. ఈ ప్రాజెక్టును మంజూరు చేస్తున్నట్టుగా వెల్లడించారు. కృష్ణానదిపై బ్రిడ్జితోపాటు 40కి.మీ మేర బైపాస్ రానుంది. అలాగే రాష్ట్ర రహదారులపై 33 ఆర్వోబీల నిర్మాణంపై కూడా సీఎం.. కేంద్ర మంత్రితో చర్చించారు. వీటన్నింటికీ ఆమోదం తెలుపుతున్నట్టు కేంద్రమంత్రి వివరించారు. తమ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపినందుకు సీఎం జగన్.. కేంద్రమంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సమావేశంలో ఆర్అండ్‌బీ మంత్రి ఎం.శంకరనారాయణ, ముఖ్యమంత్రి కార్యదర్శులతో పాటు రాష్ట్ర, రవాణా, ఆర్ అండ్ బీ ముఖ్యకార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, ఎం.ఒ.ఆర్.టి.హెచ్. ఆర్వో ఎస్.కె.సింగ్, ఎన్ఏఐ అధికారులు మహబిర్ సింగ్, ఆర్.కె.సింగ్ హాజరయ్యారు.

## సమయం

# పరోపకారం ఇదం పుణ్యం

పరోపకార పుణ్యాయ
పాపాయ పరపీడనం అన్నది ఆర్యోక్తి
నిరంతరం అప్రమత్తతో
మెలగడమే అసలు విజయ రహస్యం
అజాగ్రత్త అపజయానికి సోపానం
పరోపకారమే లక్ష్యంగా బ్రతికే
మానవుడికి అమరత్వం సాధ్యం
రాళ్ళ దెబ్బలు తిన్నా
తియ్యని ఫలాలను అందించే చెట్లు
ఔషధం లాంటి కమ్మని
పాలను ఎల్లెడలా ఇచ్చే గోమాత
పరోపకార తత్వానికి
చక్కని నిదర్శనములు

కవిత రచన:
సి.ప్రతాప్

# పంచాంగం

మాసం : మాఘ; తిథి :విదియ రా.10.39; పుబ్బ సా.5.06; రా.వ.12.21ల 1.58. | **శుక్రవారం 18-02-2022**

a **మేషం** :మీ వాగ్ధాటి, నిజాయితీలు ఎదుటివారిని ఆకట్టు కుంటాయి. స్త్రీల ఆరోగ్యంలో మెళకువ అవసరం. ఆత్మీయులకు విలువైన కాను కలు అందజేస్తారు. ఉద్యోగస్తులు విశ్రాంతికై చేయు యత్నాలు అనుకూలిస్తాయి. ద్విచక్ర వాహనంపై దూర ప్రయాణాలు మంచిది కాదు. b **వృషభం** :బంధు మిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. మీ శ్రీమతి సలహా పాటించడం వల్ల ప్రయోజనం ఉంటుంది. దీర్ఘకాలికంగా ఆగిపోయిన ధనం చేతికి వస్తుంది. లక్ష్య సాధనపై దృష్టి పెట్టడానికి సరైన సమయం. స్థిరాస్తుల అభివృద్ధి, కొనుగోలు యత్నాల విషయాలలో పునరాలోచన అవసరం. C **మిథునం** :ఆర్థిక పరిస్థితి నిరాశ పరుస్తుంది. వృత్తి, వ్యాపారాలు సజావుగా సాగుతాయి. దీర్ఘకాలిక రుణాలు తీరుస్తారు. బంధు మిత్రుల నుంచి విమర్శలు ఎదుర్కొంటారు. ఫైనాన్సు, చిట్‌ఫండ్ రంగాల వారికి ఖాతాదారుల నుంచి ఒత్తిడి, చికాకులు ఎదుర్కొంటారు. స్త్రీలు షాపింగ్ వ్యవహారాల్లో అపరిచిత వ్యక్తుల పట్ల మెళకువ అవసరం. d **కర్కాటకం** : ఆర్థిక వ్యవహారాలు నిరుత్సాహకరంగా ఉంటాయి. రాజకీయ కళా రంగాల వారికి విదేశీ పర్యటనలు అనుకూలిస్తాయి. ప్రముఖుల కలయికతో ఒక వ్యవహారం సానుకూలం అవుతుంది. కాంట్రాక్టులు దక్కుతాయి. మీ సంతానంతో ఉల్లాసంగా గడుపుతారు. నిరుద్యోగలకు ఇంటర్వ్యూలలో మెళుకవ అవసరం. ఖర్చులు అధిక మవుతాయి. e **సింహం** :ఆత్మీయుల మధ్య కానుకలు పరస్పరం ఇచ్చిపుచ్చు కుంటారు. నూతన వ్యాపారాలలో గణనీయమైన పురోభివృద్ధి సాధిస్తారు. అవగాహన లేని విషయాలకు దూరంగా ఉంటే మంచిది. దంపతుల మధ్య కొత్తకొత్త విషయాలు చర్చకు వస్తాయి. స్త్రీలకు పరిచయాలు, వ్యాపకాలు అధిక మవుతాయి. f **కన్య** : వ్యాపారాల్లో గణనీయమైన పురోభివృద్ధి సాధిస్తారు. నిరుద్యో గులు ఇంటర్వ్యూల్లో రాణిస్తారు. మీ శ్రమకు తగిన గుర్తింపు, ప్రతిఫలం లభిస్తాయి. మీ మాటకు ఇంటా బయటా ఆదరణ పెరుగుతుంది. చేపట్టిన పనుల్లో స్వల్ప ఆటంకాలు ఎదుర్కొంటారు. మీ వాహనం ఇతరులకిచ్చి ఇబ్బందు లెదుర్కొంటారు. g **తుల** : ఆర్థిక లావాదేవీలు, కుటుంబ సమస్యలు చక్కగా పరిష్కరిస్తారు. ప్రముఖుల కలయిక ఆశించిన ప్రయోజనం ఉంటుంది. నూతన పరిచయాలు, సంబంధ బాంధవ్యాలు మీ పురోభివృద్ధికి ఎంతగానో సహకరిస్తాయి. వృత్తి వ్యాపారాలలో ఆటంకాలను అధికమిస్తారు. స్త్రీలకు ఆరోగ్యంలో మెళకువ అవసరం. నిరుద్యోగులకు అశాజనకం. h **వృశ్చికం** :స్త్రీలు పని దృష్ట్యా ఒత్తిడి, చికాకులకు ఎదుర్కొంటారు. ఏ విషయంపై అయినా స్పందించే ముందు పరిణామాలు ఎలా ఉంటాయో మరొక్కసారి ఆలోచించండి. చేతి వృత్తుల వారికి సదావకాశాలు లభిస్తాయి. ప్రేమికులకు పెద్దల నుంచి ప్రోత్సాహం, సన్ని హితుల సహకారం ఉంటాయి. నిరుద్యోగులు నిరాశ, నిస్పృహలకు లోన వుతారు. i **ధనుస్సు** :ఆర్థిక వ్యవహారాలు, నూతన పెట్టుబడులకు సంబంధించి స్పష్టమైన నిర్ణయానికి వస్తారు. నిరుద్యోగులకు మధ్యవర్తుల పట్ల అప్రమత్తత అవసరం. స్త్రీలు, గృహోపకరణాలకు కావలసిన వస్తువులను కొనుగోలు చేస్తారు. దూర ప్రయాణాలలో కొత్త పరిచయాలు ఏర్పడతాయి. మీ మనసుకు ఊరట, ఉల్లాసం కలిగించే సంఘటనలు జరుగుతాయి. j **మకరం** : మిత్రులకు పెద్ద మొత్తంలో ధన సహాయం చేసేటపుడు పునరాలోచన అవసరం. మిత్రులకు పెద్ద మొత్తంలో ధన సహాయం చేసేటపుడు పునరాలోచన అవసరం. మనసులో భయాందోళనలూ అనుమానాలూ ఉన్నా, ధాంభికం ప్రదర్శించి పనులు సాఫీగా పూర్తి చేస్తారు. మీ అభిప్రాయాలకు తగిన వ్యక్తితో పరిచయాలేర్పడతాయి. స్వయంకృషితో వ్యాపారాలలో బాగా రాణిస్తారు. మీ సంతానంతో ఉల్లాసంగా గడుపుతారు. k **కుంభం** : కుటుంబీకులతో కలిసి నూతన ప్రదేశాలను సందర్శిస్తారు. మిత్రుల, సహోదరుల సాయంతో మీ పనులు సులువుగా పూర్తి చేయ గలుగుతారు. వృత్తి కళా రంగాలలో మీ ప్రాధాన్యత అధికమవుతుంది. అనుకోని మార్పులు ఏర్పడటంతో రోజువారీ మీ కార్యక్రమాలు సకాలంలో జరుగక అసహనం పెరుగుతుంది. హోటల్, క్యాటరింగ్ వ్యాపారులకు లాభం చేకూరుతుంది. L **మీనం** : ఇంటా బయటా కూడా తలపెట్టుకున్న పనులకు ఆటంకాలు తప్పక పోవచ్చు. ప్రచారసాధనాలు, రవాణా రంగాల్లో మీ పెట్టుబడులు సత్ఫలితాల నిస్తాయి. విహార స్థలాలు, దేవాలయాలను సందర్శిస్తారు. స్థిరచరాస్తుల అభివృద్ధికి ప్రణాలికలు సిద్ధం చేస్తారు.

# రూ.3,096 కోట్లతో టిటిడి బడ్జెట్‌కు ఆమోదం



నిర్మాణం కోసం ఏడాదిలో దశల వారీగా టిటిడి వాటా నుండి రూ.150 కోట్లు చెల్లించి, వచ్చే ఏడాది డిసెంబరు నాటికి శ్రీనివాస సేతు ఫ్లైఓవర్‌ను ప్రజలకు పూర్తి స్థాయిలో అందుబాటులోకి తేవాలని నిర్ణయం.

రూ.2.73 కోట్లతో స్విమ్స్‌కు కంప్యూటర్లు కోనుగోలు చేసి పూర్తి స్థాయిలో కంప్యూటరీకరణకు ఆమోదం.

టిటిడి ఉద్యోగులు, పెన్షనర్లకు కార్పొరేట్ ఆసుపత్రుల్లో నగదు రహిత వైద్యం అందించడానికి రూ.25 కోట్లు నిధి ఏర్పాటు.

తిరుచానూరు సమీపంలోని శ్రీ పద్మావతి నిలయంను బాలాజి జిల్లా కలెక్టరెట్‌గా రాష్ట్ర ప్రభుత్వానికి టిటిడి నిబంధనల మేరకు లీజుకు ఇచ్చేందుకు నిర్ణయం. తిరుమల మాతృశ్రీ తరిగొండ అన్నప్రసాద భవనంలో స్టీమ్ ద్వారా అన్నప్రసాదాల తయారు చేస్తున్న విషయం తెలిసిందే. టిటిడి గ్యాస్, డిజిల్ ద్వారా కేజి స్టీమ్ తయారీకి 4 రూపాయల 71 పైసలు ఖర్చు చేస్తోంది. NEDCAP వారు సోలార్ సిస్టమ్ RESCO మోడల్ స్టీమ్‌ను కేజి 2 రూపాయల 54 పైసలతో 25 సంవత్సరాల పాటు సరఫరా చేయడానికి ఒప్పందం. తద్వారా టిటిడికి దాదాపు రూ.19 కోట్లు ఆదాయం చేకూరుతుంది. తిరుమలలో రాబోవు రోజుల్లో హొటళ్ళు, ఫాస్టు ఫుడ్ సెంటర్లు లేకుండా చేసి అన్ని ముఖ్య కూడళ్ళలో ఉచితంగా అన్నప్రసాదాలు అందించాలని నిర్ణయం. అత్యున్నత స్థాయి నుండి సామాన్య భక్తుడి వరకు ఒకే రకమైన ఆహారం అందించాలని తీర్మానం. ఈ నిర్ణయం వల్ల ఇబ్బంది పడే వ్యాపారులకు ఇతర వ్యాపారాలు చేసుకోవడానికి లైసెన్స్‌లు మంజూరు చేయాలని తీర్మానం.

తిరుపతిలోని అలిపిరి వద్ద సైన్స్‌సిటి నిర్మాణానికి మంజూరు చేసిన 70 ఎకరాల భూమిలో 50 ఎకరాలు వెనక్కు తీసుకుని ఆధ్యాత్మిక నగరం నిర్మించాలని నిర్ణయం.ఈ పనులకు త్వరలో ముఖ్యమంత్రితో శంకుస్థాపన.

తిరుమల నాదనీరాజన మండపం షెడ్డు స్థానంలో శాశ్వత మండపం నిర్మించాలని నిర్ణయం.

- అన్నమయ్య మార్గం త్వరలో భక్తులకు అందుబాటులోకి తేవడానికి ఇప్పుడు ఉన్న మార్గాన్ని అభివృద్ధి చేయాలని తీర్మానం. అటవీ శాఖ అనుమతులు లభించిన తరువాత పూర్తి స్థాయిలో అబివృద్ధి పనులు చేపట్టాలని తీర్మానం.
- రూ.3.60 కోట్లతో టిటిడి ఆయుర్వేద ఫార్మశీకి పరికరాలు కొనుగోలు చేసి రాష్ట్ర వ్యాప్తంగా ఆయుర్వేద మందులు అందుబాటులో ఉంచాలని తీర్మానం.
- శ్రీవారి ఆలయ మహద్వారం, బంగారువాకిలి, గోపురంకు బంగారు తాపడం చేయించాలని నిర్ణయం. గోపురాల బంగారు తాపడం విషయంపై ఆగమ పండితులతో చర్చించి క్రేన్ సహయంతో తాపడం పనులు పూర్తి చేయించే సాధ్యాసాధ్యాలు పరిశీలించాలని అధికారులకు ఆదేశం. - ముంబైలో శ్రీవారి ఆలయ నిర్మాణానికి భూమి కేటాయింపు కోసం నెలాఖరులోపు మహారాష్ట్ర ముఖ్యమంత్రిని కలవాలని నిర్ణయం. ఈ మేరకు ధర్మకర్తల మండలి సభ్యులు శ్రీ మిలింద్ నర్వేకర్‌కు సమన్వయ బాధ్యతలు అప్పగింత. అలాగే ఇప్పటికే కేటాయించిన భూమిని స్వాధీనం చేసుకుని సమాచార కేంద్రం నిర్మించాలని తీర్మానం.
- సామాన్య భక్తులకు కేటాయించే ఆర్జిత సేవా టికెట్ల ధరలు పెంచినట్లు మీడియాలో జరిగిన ప్రచారం అవాస్తవం.

ధర్మకర్తల మండలి సమావేశంలో ఈవో డాక్టర్ కె.ఎస్. జవహర్ రెడ్డి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి వాణి మోహన్, దేవాదాయ శాఖ కమిషనర్ హరిజవహర్ లాల్, అదనపు ఈవో ఎవి.ధర్మారెడ్డి, బోర్డు సభ్యులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, పోకల ఆశోక్ కుమార్, సనత్‌కుమార్, మారుతీ ప్రసాద్, కాటసాని రాం భూపాల్ రెడ్డి, మధుసూధన్ యాదవ్, సంజీవయ్య, విశ్వనాథ్,శ్రీ రాములు, విద్యాసాగర్, మల్లీశ్వరి, శివకుమార్, ఢిల్లీ స్థానిక సలహామండలి అధ్యక్షురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, చెన్నైస్థానిక సలహామండలి అధ్యక్షులు శేఖర్ రెడ్డి, జెఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం, సివిఎస్వ గోపినాథ్ జెట్టి ఉన్నారు.

అనంతరం జరిగిన ధర్మ ప్రచార పరిషత్ కార్యనిర్వహక మండలి సమావేశంలో శ్రీనివాస వ్రత విధానం పుస్తకాలు ముద్రించి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయం తీసుకున్నారు.

# 21న జరగబోయే బహిరంగ సభకు జయప్రదం చేయండి




అరకులోయ (విజయభానున్యూస్) : పార్లమెంట్ సభ్యులు యువ నేత కాబోయే భారత ప్రధానమంత్రి. రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు అరకు వేలిలో అఖిల భారత జాతీయ కేంద్ర కాంగ్రెస్ పార్టీ అగ్ర నేతలు వస్తున్నారని. ఈనెల ఫిబ్రవరి 21న ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరకు పార్లమెంట్ డిస్ట్రిక్ట్ ఇంచార్జ్ పాచిపెంట శాంత కుమారి.ఆధ్వర్యంలో బహిరంగ సభ సమావేశాలు నిర్వహిస్తున్నామని, అరకు పార్లమెంట్ స్థానం పరిధిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని జీ.ఏ నారాయణ రావు! ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరియు జోనల్ ఇంచార్జ్. (ఉత్తరాంధ్ర మరియు ఏజెన్సీ) సభ్యత్వ నమోదు మరియు ఇతర కార్యక్రమాలు.! అంబటి కృష్ణ రావు, అరకు పార్లమెంట్ సభ్యత్వ నమోదు ఇంచార్జ్.పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా గురువారం శాంతకుమారి ఆధ్వర్యంలో అరకు వేలి మండలంలో సభ ఏర్పాట్ల పరిశీలనకై అరకు వేలి లో పర్యటించిన ఆయన 21.న అరకు వేలి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద జరగబోయే బహిరంగ సభ సమావేశాలలో ప్రతి ఒక్కరు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మాజీ పార్లమెంట్ సభ్యురాలు మాది ఆర్ జి. పి ఆర్ ఎస్ నేషనల్ చైర్మన్ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల ఆర్గనైజేషన్ పి ఆర్ ఓ మీనాక్షి నటరాజన్ . ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సాకే శైలజనాథ్ మరియు ఏ ఐ సి సి నంబర్స్ మాజీ కేంద్ర రాష్ట్ర మంత్రివర్యులు, ఎ పి సి సి వర్కింగ్ ప్రెసిడెంట్ లు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, రాష్ట్ర మహిళా నాయకురాలులు, పాల్గొన పాల్గొంటారన్నారు

ఈ సభ యొక్క ముఖ్య ఉద్దేశం క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవానికి కేంద్ర రాష్ట్ర కాంగ్రెస్ కమిటీల బలోపేతానికై వ్యూహాత్మక ప్రణాళికలు, డిజిటల్ సభ్యత్వ నమోదు, నూతన చేరికలు కమిటీల నియామకం నిర్వహించడం జరుగుతుందని.! కావున అరకు పార్లమెంట్ స్థానం పరిధిలోగల అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల జిల్లాల మండలాల అధ్యక్షులు ఉపాధ్యక్షులు కార్యదర్శిలు కార్యకర్తలు నాయకులు, కాంగ్రెస్ పార్టీ అన్ని అనుబంధ సంస్థల అధ్యక్షులు ఉపాధ్యక్షులు కార్యదర్శులు నాయకులు కార్యకర్తలు అభిమానులు ప్రతి ఒక్కరూ పాల్గొని సభను జయప్రదం చేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో మూల లేపాక్షి.అరకు పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో అన్ని మండలాల అధ్యక్షులు కార్యదర్శులు పాచిపెంట చిన్నస్వామి శెట్టి భగత్ రాం గుంజిడి సుబ్బారావు, పంచడి కృష్ణ మొస్య ప్రేమ్ కుమార్, తడభారికి బిమరావు పాలకీ ఆనంద్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు ప్రజలు అభిమానులు పాల్గొనరు

# మర్యాదపూర్వక భేటీ



జస్టిస్ బట్టు దేవానంద్‌కు పుష్పగుచ్చం అందజేస్తున్న వీసీ పి.వి.జి.డి ప్రసాద రెడ్డి

ఆంధ్రవిశ్వవిద్యాలయం (విజయభాను న్యూస్) : పూర్వవిద్యార్థి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ విశాఖ నగరానికి విచ్చేసారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి మర్యాదపూర్వకంగా జస్టిస్ బట్టు దేవానంద్‌తో భేటీ అయ్యారు. జస్టిస్ దేవానంద్‌కు పుష్పగుచ్చం అందజేసి ఆహ్వానించారు. అనంతరం విశ్వవిద్యాలయ అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.

# భీంపోలు పంచాయతీలో కరోనా వ్యాక్సినేషన్



అనంతగిరి (విజయభాను న్యూస్) : అనంతగిరి మండలం భీంపోలు పంచాయతీ లో గల ఎగువ చిమిడిపల్లి, దిగువ చిమిడిపల్లి ,వలస మూడు గ్రామాల్లో ప్రజలకు 49 మందికి కరోనా వ్యాక్సినేషన్ నేచర్ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది మరియు ఆరోగ్య శాఖ సిబ్బంది ఆశా వర్కర్లు లక్ష్మి మరియు కమల ప్రజలను మోటివేట్ చేసి కరోనా వేక్షిన్ సంపూర్ణంగా వేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నేచర్ కార్యకర్త ప్రసాద్ మాట్లాడుతూ ప్రజలందరూ కరోనా పై అవగాహన కలిగి ఉండి అర్హులైన ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా కరోనా వేక్షిన్ వేసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో...

సీనియర్ ఏ.యన్.యం కొండమ్మ హాజ రయ్యారు.

# కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో బాలల అదాలత్ లు నిర్వహించాలి

## - సీఆర్పీఎఫ్ రాష్ట్ర కన్వీనర్ గొండు సీతారాం



అక్కయ్యపాలెం (విజయభాను న్యూస్) : రాష్ట్రంలో పరిష్కారానికి నోచుకోని ఎన్నో బాలల హక్కులు,సంక్షేమ కార్యక్రమాలతో ముడిపడి ఉన్న వివిధ అంశాలను తక్షణమే పరిష్కార దిశగా కేంద్ర ప్రభుత్వం బాలల అదాలత్ ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం(సీఆర్పీఎఫ్) రాష్ట్ర కన్వీనర్ గొండు సీతారాం కేంద్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రికి,కేంద్ర ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి సంస్థ జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమీషన్(ఎన్సిపిసిఆర్)చైర్ పర్సన్ ప్రియాంక కనొంజుకు లేఖ వ్రాసినట్లు గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన తెలిపారు,ఈ లేఖలో ఆంధ్ర ప్రదేశ్ లోని అన్ని జిల్లాల ప్రధాన కేంద్రాల్లోనూ ముఖ్యంగా గ్రేటర్ విశాఖ నగరంలో వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో బాలల అదాలత్ ల నిర్వహణకు సత్వరమే చర్యలు చేపట్టాలని కోరినట్టు చెప్పారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ గత మూడేళ్ల క్రితం విశాఖ నగరంతో పాటు మరికొన్ని పట్టణాల్లో కేంద్ర ప్రభుత్వం ఎన్సిపిసిఆర్,రాష్ట్ర బాలల హక్కులు పరిరక్షణ కమీషన్ సంయుక్తంగా బాలల ఫిర్యాదులు స్వీకరణకుప్రత్యేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి కొన్నింటికి పరిష్కార మార్గాలు చూపించారని అన్నారు,మళ్లీ ఇటువంటి కార్యక్రమాలు నిర్వహణ రాష్ట్రంలో లేక పోవడం వల్ల బాలల హక్కుల పరిరక్షణ సమస్యలు తిష్ట వేసిన విషయాన్ని కేంద్ర ప్రభుత్వానికి గుర్తు చేసినట్టు చెప్పారు,గత 18 నెలలుగా మన రాష్ట్రంలో బాలల హక్కుల పరిరక్షణ కమీషన్(యస్ సిపిసియార్) మనుగడ లేకపోవడం వల్ల బాలల ఎన్నో వెతలు ఎదుర్కొంటున్నారని అన్నారు,లైంగిక వేదింపులు, బాల్య వివాహాలు,బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన,ప్రైవేట్,కార్పొరేట్ పాఠశాలల్లో యాజమాన్యాల అరాచకాలు,వేదింపులు,ఫీజులపై ఒత్తిడిలు,ఇతర నిర్భంధ కాండలు,బాలల హక్కులు సంక్షేమ కార్యక్రమాలుతో ముడిపడి ఉన్న సమస్యలు లెక్కకు మించి పరిష్కారానికి నోచుకోకుండా ఉన్నాయని గుర్తు చేశారు,బాలల హక్కుల పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని కేంద్రం,రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా తక్షణమే బాలల అదాలత్ లు ఏర్పాటుకు ముందుకు రావాలని కోరారు,ఇదే అంశాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి,అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం,రాష్ట్ర స్త్రీ,శిశు సంక్షేమ శాఖ మంత్రి తానేటి వనిత,సంభందిత శాఖల ఉన్నతాధికారులు దృష్టికి లేఖలు రూపంలో తీసుకెళ్లినట్లు తెలిపారు.

# యారాడలో బాలికపై అత్యాచారం

గాజువాక: (విజయభాను న్యూస్ ): గత రాత్రి యారాడ కొండపై 14 సంవత్సరాల మైనర్ బాలికపై గంగవరంకు చెందిన మైలపల్లి రాజు( 26) అనే యువకుడు అత్యాచారం కి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది . పెదగంట్యాడ లో తిరునాలకు వచ్చిన ఇద్దరు అక్కాచెల్లులు మైనర్ భాలికలు పరుస అనంతరం అక్కకి ఇంటికి వెళ్లమని చెప్పింది . దింతో అక్క ఇంటికి వెళ్ళిపోయింది. తల్లి దండ్రులు చెల్లి ఏదని అడగగా తిరుణాల పరసలో వుందని చెప్పింది .రాత్రి 9:గంటలకు సమయంలో మైనర్ భాలిక తో పాటుగా పెదగంట్యాడ నీలాపువీదికి చెందిన గణేశ్ అనే 18 సంవత్సరాల యువకుడితో కలిసి యారాడ కొండపై ఇద్దరు కలిసి వెళ్ళారు. ఇంతలో ఇద్దరికి తోడుగా మైలపల్లి రాజు వెళ్లాడు. ఈక్రమంలో మధ్యం పూటుగా త్రాగి అత్యాచారం చేసినట్టు బాలిక 100 కు డైల్ చేసి సమాచారమిచ్చింది. దింతో అర్ధరాత్రి పోలీసులు యారాడ కొండప్తెకి వెళ్ళి మ్తెనర్ బాలికను కెజిహెచ్ కు తరలించారు . తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

# వైసిపి ప్రభుత్వంపై గౌరవ ముఖ్యమంత్రి వర్యులు పై ప్రధాన ప్రతిపక్ష నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాలను మానుకోవాలి



పాడేరు (విజయభాను న్యూస్) : వైసీపీ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టినటువంటి నవరత్నాలు పథకాలు నూటికి నూరు శాతం అమలు చేస్తుంటే టిడిపి నాయకులు ఓర్వలేక తప్పుడు ప్రచారం చేయడం తగదు, ఇటీవల జరిగిన తూర్పుగోదావరి జిల్లా, రంపచోడవరం నియోజకవర్గం, రాజవొమ్మంగి మండలం లో దొడ్డి గ్రామంలో కల్తీ జీలుగు కళ్ళు సేవించి ఐదుగురు ఆదివాసీలు మృతి చెందారని తప్పుడు ప్రచారాలను చేస్తూ ప్రజలను మభ్యపెట్టి వైసిపి లో గెలిచిన ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి గారు సోదరుడు వారి వ్యక్తిగత కక్షలు వలన, రాజకీయ లబ్ధి పొందడం కొరకు కళ్ళు కి అతనే గడ్డి మందు కలిపి రైతులకు తాగించి మరణించిన కుటుంబాలకి ఆదుకోవాలని తప్పుడు ప్రచారం చేస్తారా, గత ప్రభుత్వం సుమారు 600 హామీలు ఇచ్చి ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా ఇప్పుడు నూటికి నూరు శాతం అమలు చేస్తున్న ప్రభుత్వానికి తప్పుడు ప్రచారాలు చేయడం తగదు ఏదో ఒకరకంగా రాజకీయ లబ్ధి పొందుదామని పగటి కలలు కంటున్న టిడిపి నాయకులకు రానున్న ఎన్నికల్లో కూడా ప్రజలే బుద్ధి చెబుతారు ఇప్పుడు ప్రజా సంక్షేమంతో పాటు అభివృద్ధి రోడ్లు గ్రామ సచివాలయాలు నాడు-నేడు జగనన్న చేదోడు వంటి అనేక నవరత్నాల తో పాటు పెట్టినటువంటి అనేక పథకాలు కూడా పారదర్శకంగా అర్హులైన ప్రతి లబ్దిదారునికి మా యొక్క వైయస్సార్ జగన్ గారి ప్రభుత్వం ద్వారా అందిస్తున్నాము, అంతేకాకుండా ఆర్ ఓ ఎఫ్ ఆర్ పట్టాలు ఇళ్ల పట్టాలు అందిస్తూ ఎప్పటినుంచో ఉన్న ఓ టి ఎస్ విధానాన్ని అమలు చేస్తూ గిరిజన ప్రాంతానికి మినహాయిస్తూ గిరిజన పక్షపాతి కి ఉన్న పార్టీ ప్రభుత్వాన్ని విమర్శలు మానుకోవాలి, అని హెచ్చరిస్తున్నాను,అలాగే జీలుగు కళ్ళకి గడ్డి మందు కలిపిన నిందితుడికి రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే సోదరుడికి ప్రభుత్వం కఠినంగా శిక్షించాలి,

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సీదరి మంగలన్న దొర,సర్పంచులు గబ్బాడి చిట్టి బాబు, ఎం. రావణమ్మ, కె.సన్నీబాబు, ఎంపీటీసీ లు కె.నరసింహ మూర్తి, మాజీ సర్పంచులు కె. సూరిబాబు కన్నపాత్రుడు, యువజన విభాగం నాయకులు కె. కొండాజీ , నాయకులు కటారి చందు, కె. నాగేంద్ర, నగేష్, నవీన్,గల్లెల లింగమూర్తి, సత్యనారాయణ రామారావు కొండబాబు పాలుగున్నారు.

# సత్యదేవుని నిత్యాన్నదాన ప్రధకానికి రూ.1,01,116/- విరాళం



అన్నవరం (విజయభాను న్యూస్) : తూర్పుగోదావరి జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో ఎంతో ప్రతిష్టా త్మక ంగా నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి తూర్పుగోదావరి జిల్లా కాకినాడ కు చెందిన ఓడూరి.సూరిబాబు రూ.1,01,116/- విరాళమును దేవస్థానం సూపరింటెండెంట్ ఐ.వి.రామారావు కు అందజేసి ప్రతీ సంవత్సరం దీనిపై వచ్చు వడ్డీతో డిశంబరు 18వ తేదీన ఓడూరి.శ్రీ హర్ష పేరున అన్నదానం జరిపించవలసిందిగా కోరారు.ఈ సందర్భంగా దాతలను సూపరింటెండెంట్ ఐ.వి.రామారావు అభినం దించారు.

# గుత్తులపుట్టు ఎంపీటీసీ వైసీపీలో చేరిక..



పాడేరు (విజయభాను న్యూస్) : మండలం లోని గుత్తులపుట్టు సెగ్మెంట్ ఎంపిటిసి సన్యాసి రావు స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొంది గురువారం స్థానిక శాసన సభ్యురాలు భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో వైసీపీలో చేరారు. మండలంలో ఎంపీపీ పదవి పోటీలో కీలక పాత్ర పోషిం చారు. ఈ తరుణంలో స్థానిక శాసన సభ్యులతో కలిసి ఎమ్మెల్యే చేతులమీదుగా వైసీపీ కండువా కప్పుకున్నారు. ఈయనతో పాటు పలువురు వార్డు మెంబర్లు కార్యకర్తలు పార్టీలో చేరారు.

## వైభవంగా సింగవరం

## శ్రీశ్రీశ్రీ షిర్డిసాయిబాబా వార్షికోత్సవం



కొయ్యూరు (విజయభాను న్యూస్) : కొయ్యూరు మండలం సింగవరం గ్రామంలలో వెలసిన శ్రీషిర్డి సాయిబాబా మందిరంలో గురువారం శ్రీబాబా వారి 17వ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహిం చారు. ఉదయం ప్రభాత సేవ (మేలుకొలుపు), చందనాభిషేకం, పాలాభిషేకం, విభూతి అభిషేకం, అష్టోత్తర పూజా కార్యక్రమం, గణపతి హోమం, సాయిగాయత్రి హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అలాగే 12 గంటలకు కొయ్యూరు వాస్తవ్యులు గంగిశెట్టి నరసింహమూర్తి, శ్రీమతి రత్నమ్మ కుమారుడు రామారావు, వెంకటలక్ష్మీ దంపతుల వారి ఆధ్వర్యంలో విశేష అన్నసంతర్పణ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. సాయంత్రం సంధ్యాహారతి, రాత్రి 8.30 పవళింపు సేవ, 9.30గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.

# 71వ రోజుకు చేరుకున్న రిలే నిరాహార దీక్షలు



గాజువాక : (విజయభాను న్యూస్ ): విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద 371వ రోజు జరుగుతున్న రిలే నిరాహార దీక్షలో విశాఖ ఉక్కు కర్మాగారం నుంచి పలు విభాగాల ప్రతినిధులు,కార్యకర్తలు పాల్గొన్నారు. వీరిని ఉద్దేశించి విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ప్రతినిధులు గంధం వెంకట్రావు, వైటి దాస్, యు రామస్వామి, నీరుకొండ రామచంద్రరావు, డి ఆదినారాయణ, వరసాల శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎన్నికల్లో గెలవడం కోసం ప్రజల మధ్య మత విద్వేషాలను రెచ్చగొట్టి సమాజంలో అశాంతిని సృష్టిస్తోందని వారు తీవ్రంగా విమర్శించారు. అందుకు ప్రత్యక్ష ఉదాహరణ ముస్లిం మహిళలు ధరించే వేషధారణన పై వివాదాన్ని సృష్టించి దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది వారన్నారు. బిజెపి గడచిన ఐదు సంవత్సరాలుగా ప్రజలకు చేసిన అనేక అన్యాయాలపై ప్రజల దృష్టి మరల్చడానికి ఈ అంశాన్ని ఈ సమయంలో ముందుకు తీసుకువచ్చారని వారు స్పష్టం చేశారు. కరోనా సమయంలో ప్రజల ఆదాయాలు కోల్పోయి అనేక ఇబ్బందులు పడుతుంటే పెట్రోల్ డీజిల్ భారాల తో 84% ప్రజలను దుర్భర జీవితం లోకి నెట్టివేయబడ్డారు అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కనుక ఈ సమయంలో ప్రజలను ఐక్యపరచి ఐక్య ఉద్యమాలు మరింత ఉధృతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

దీక్షా శిబిరంలో ఉక్కు కర్మాగారానికి చెందిన పలు విభాగాల ప్రతినిధులు రమణ మూర్తి, సన్యాసిరావు, శశి రెడ్డి, రాథోడ్, వెంకటేశ్వరరావు, ఎమ్. రమణ, మాణిక్యాలరావు, షేక్, వెంకట్, నరసింహ మూర్తి, ఆనంద్, నాని బాబు, మధుసూదన్ రెడ్డి, శ్రీనివాస్ తదితరులతోపాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మానవ వనరుల అభివృద్ధికి ‘సమిద’ స్వచ్ఛంద సంస్థ కృషి



అనంతగిరి (విజయభాను న్యూస్) : స్థానిక “ సమిద “ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కేంద్ర కార్మిక విద్య మరియు అభివృద్ధి సంస్థ రీజినల్ కార్యాలయము విశాఖపట్నం వారి సహకారంతో 16 మరియు 17 వ తేదీలలో చప్పాడి, కొత్త లాంగి, కొయిట గూడ గ్రామాలలో మహిళలు మరియు యువత బాగస్వామ్యంతో శిక్షణా కార్యక్రమము నిర్వహించుచున్నది. ఈ నాటి ఈ కార్యక్రమమునకు బొర్రా గ్రామ సర్పంచ్ శ్రీ జన్ని అప్పారావు పాల్గొనుట జరిగింది. సర్పంచ్ గారు మాట్లాడుతూ మానవ వనరుల అభివృద్ధికి శిక్షణలు ఎంతగానో ఉపయోగ పడునని శిక్షణల ద్వారా అనేక క్రొత్త విషయాలు తెలిసుకొని సమగ్ర పణాళిక చేసుకొనుటకు అవకాశం ఉంటుందని తెలియజేసారు. కార్యక్రమములో కేంద్ర కార్మిక విద్య మరియు అఆవృద్ధి సంస్థ రీజన తే డైరక్టరు గారైన సయ్యద్ బషీర్ అహమ్మద్ మాట్లాడుతూ ‘ సమిద ‘ సంస్థ ఆద్వ ర్యంలో మారుమూల గిరిజన గ్రామాలలో యువతీ, యువకులకు ప్రభుత్వ పథకాలు , అందేవిధంగా అవి ఏ విధంగా పొందాలి . అందేవిధంగా పలు చట్టాలపై అవగాహన మరియు చైతన్యము కల్పించుట జరుగుచున్నదని తెలియజేసారు. ఈ కార్యక్రమములో ‘ సమిద ‘ సంస్థ కార్యదర్శి డీ.వీరభద్ర రావు మాట్లాతూ కేంద్ర కార్మిక విద్య మరియు అభివృద్ధి సంస్థ సహకారంతో ప్రతి ఒక్కరిని చైతన్య పరచి ప్రభుత్వ పథకాల అమలు తో బాగస్వాయ్యం పెంచేవిధంగా అందుకొరకు మారు మూల గిరిజన గ్రామాలు ఎంపిక చేసుకొని గిరిజన యువత అన్ని రంగాలలో ముందుండాలని అందుకొరకు ఇటువంటి శిక్షణలు యువతకు ఎంతగానో దోహద పడతాయని తెలియజేసారు. కార్యక్రమములో సంస్థ సిబ్బంది దీసరి.బుద్ధరాజు , దేముడమ్మ , సింహాద్రి, బిడ్డా ప్రసాద్ , కృష్ణ , సోమెల.సుదాకర్, అప్పలరాజు పాల్గొన్నారు.

## గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

## సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు



మాకవరపాలెం (విజయభాను న్యూస్) : గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్య లను తక్షణమే పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం మాకవరపాలెం మండలంలో గ్రామ రెవెన్యూ సహాయకులు(విఆర్ఎలు) చేస్తున్న దీక్షలకు సంఘీభావ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ విఆర్ఎలకు రూ.21వేతనం ఇవ్వాలని, ముఖ్యమంత్రి హామీ అమలు చేయాలన్నారు. ఇచ్చిన డిఎ రికవరీ ఉత్తర్వులు ఉపసంహరించు కోవాలని, డిఎతో కూడిన వేతనం ఇవ్వాలన్నారు. నామినీలుగా పని చేస్తున్న వారందరికి విఆర్ఎలుగా నియమించాలని, ఆ కుటుంబాలకు న్యాయం చేయాలన్నారు. అర్హులందరికి ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాన్ని విఆర్ఎలకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. 65 సంవత్సరాలు దాటి చనిపోయిన విఆర్ఎ కుటుంబాలలో కంపాసినేట్ కింద ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, విఆర్ఎల సమస్యలపై సిసిఎల్ఎ అధికారుల రాష్ట్ర కమిటీ చర్చలు జరపాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు డి.సత్తిబాబు, అడిగర్ల రాజు, విఆర్ఎల సంఘం నాయకులు సత్యనారాయణ, అప్పలకొండ, లక్ష్మి, ధనలక్ష్మి పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభను విజయవంతం చేయండి

### కాంగ్రెసు మండలపార్టీ అధ్యక్షుడు పంచాడి కృష్ణ



అనంతగిరి (విజయభాను న్యూస్) : అరకు లోయ పార్లమెంట్ నియోజకవర్గ కేంద్రం అరకువేలిలో జరిగే కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరకు పార్లమెంట్ డిస్ట్రిక్ట్ ఇంచార్జ్ పాచిపెంట శాంతకుమారి ఆదేశాల మేరకు అనంతగిరి మండల పార్టీ అధ్యక్షుడు పంచాడీ.క్రిష్ణ బుధవారం నాడు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 21 తేదీన జరగబోయే కాంగ్రెస్ పార్టీ సమావేశాలకు రాష్ట్ర పార్టీ పి సి సి అధ్యక్షుడు సాకే శైలదానాథ్.తులసిరెడ్డి తో పాటుమాజీ పార్లమెంట్ఆర్.జి.పి.ఆర్.ఎస్.నేషనల్ చైర్మన్ శ్రీమతి మీనాక్షి నటరాజన్ గారు హాజరవుతారు,పార్లమెంట్, మండల, పరిధిలో గల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు తదితరులు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు,

## రక్తదాన శిబిరం ప్రారంభం



గొలుగొండ (విజయభాను న్యూస్ గొలుగొండ మండలం చీడిగుమ్మల జడ్పీ హైస్కూల్‌లో జూనియర్ రెడ్ క్రాస్ సభ్యుల ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరాన్ని గొలుగొండ జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ అన్ని దానాల కంటే రక్తదానం ప్రాణదానమన్నారు. ప్రతీ ఒక్కరూ రక్తదానం చేయాలన్నారు.

### ఎస్కే యూనివర్సిటీ బయోటెక్నాలజీ డిపార్ట్మెంట్ లో విధులు నిర్వహిస్తున్న

## ప్రొఫెసర్ మురళీధర్ రావును సస్పెండ్ చేయాలి

## ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్ బాబు



అన్నవరం : ఎస్కె యూనివర్సిటీ బయోటెక్నాలజీ డిపార్ట్మెంట్ లో విధులు నిర్వహిస్తున్న ప్రొఫెసర్ మురళీధర్ రావును సస్పెండ్ చేయాలిని ఈరోజు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఎస్కె యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ రామకృష్ణారెడ్డి గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీలో అసోసియేట్ ప్రొఫెసర్ గా విధులు నిర్వహిస్తున్న మురళీధర్ రావు ఒక్క రాజకీయ పార్టీ అనుబంధం విద్యార్థి సంఘం ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడుగా నియమించారు అన్నారు. అసోసియేట్ ప్రొఫెసర్ గా ఉంటూ ఒక్క రాజకీయ పార్టీ అనుబంధ విద్యార్థి సంఘం అయిన ఏబీవీపీలో పదవులు ఎలా తీసుకుంటారుని ప్రశనిస్తున్నాము. విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు విద్యను బోధించాలిసిన ఆచార్యులే ఇలా ఒక్క రాజకీయ పార్టీ అనుబంధం విద్యార్థి సంఘంలో ఒక్క రాష్ట్ర అధ్యక్షుడు పదవి తీసుకోవడం ఎంత వరకు కరెక్ట్ అన్నారు.మురళీధర్ రావు విద్యార్థులకు ఉపయోగపడే విద్యను విద్యార్థులకు బోధిస్తార లేక మత రాజకీయాలు బోధిస్తార అని మండిపడ్డారు.ఇప్పటికె ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడుగా ఎస్కె యూనివర్సిటీకి చెందిన బయోటెక్నాలజీ డిపార్ట్మెంట్ అసోసియేట్ ప్రొఫెసర్ మురళీధర్ రావును నియమించినట్లు వివిధ వార్త పత్రికలలో, సోషియల్ మీడియాలో కూడా రావడం జరిగిందిన్నారు. యుజీసీ నిబంధనలకు విరుద్ధంగా ఒక్క ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న విశ్వవిద్యాలయంలో అసోసియేట్ ప్రొఫెసర్ గా విధులు నిర్వహిస్తూ రాజకీయ పార్టీ అనుబంధ విద్యార్థి సంఘం ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడు పదవి తీసుకున్నందుకు మురళీధర్ రావు ను వెంటనే సస్పెండ్ చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్యగా డిమాండ్ చేశారు లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనకు శ్రీకారం చుడుతాం అని హెచ్చరించారు.. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చిరంజీవి రాజేంద్ర జిల్లా ఉపాధ్యక్షులు కుల్లాయస్వామి.. ఎస్కె యూనివర్సిటీ నాయకులు ఆనంద్ రెడ్డి,సతీష్, వీరేశ్ తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యకార గ్రామాలలో జన సేన నాయుకులు పాదయాత్ర

భీమునిపట్నం (విజయభాను న్యూస్) : భీమిలి నియోజకవర్గం మత్స్యకార గ్రామంలో పవన్ కళ్యాణ్ మత్స్యకార అభ్యున్నతి సభ లో భాగంగా భీమిలి జనసేన మత్స్యకార నాయకుల ఆధ్వర్యంలో గురువారం ఉదయం అవంతి కాలెజీ నుంచి అన్నవరం,నాగమయ్యపాలెం, మంగమారిపేట,‌కె.నగరపాలెం, జంక్షన్,కాపుల దిబ్బడపాలెం,చేపలుప్పాడ, చిన్న ఉప్పాడ, పెద్ద ఉప్పాడ ప్రాంతాలలో పాదయాత్ర నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మత్స్యకార వికాస ప్రధాన కార్యదర్శి ముగి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలోభీమిలి నియోజకవర్గ ఇన్ ఛార్జ్ డా.సందీప్ పంచకర్ల, జనసేన పార్టీ నాయకులు, వీర మహిళలు, జనసైనికులు పాల్గొన్నారు.

# ఘనంగా సత్యదేవుని సన్నిధిలో ‘కోటి తులసి పత్రి పూజ’





అన్నవరం (విజయభాను న్యూస్) : తూర్పుగోదావరి జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం నందు శ్రీ స్వామివారి సన్నిధిలో లోక కళ్యాణార్థం రాష్ట్రంలో ప్రజలందరూ కరోనా,ఒమిక్రాన్ తదితర వ్యాధుల నుండి విముక్తి పొంది సస్యశ్యామలంగా ఉండుటకు గురువారం “కోటి తులసి పత్రి పూజ” ను 50 మంది ఋత్వికులచే శాస్త్రోక్తంగా ఘనంగా ప్రారంభించారు.ముందుగా ఆలయ ప్రాంగణంలో వార్షిక కళ్యాణ వేదికపై శ్రీ స్వామి,అమ్మవార్ల ఉత్సవ మూర్తులను వేద పండితుల మంత్రోచ్చారణము,మంగళ వాయిద్యాల నడుమ తోడ్కొని వచ్చి వివిధ సుగంధ భరితమైన పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన వేదికపై ఆశీనులు గావించి వైదిక బృందం చే గణపతి పూజ,పుణ్యాహ వచనం,ఋత్వికులకు దీక్ష వస్త్రము లు చేసి అనంతరం శ్రీ స్వామి,అమ్మ వార్లకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి “కోటి తలసి పత్రి పూజ” ప్రారంభించారు.కోటి తులసి పత్రి పూజ 10రోజుల పాటు జరుగుతుంది.26న జరిగే పూర్ణహుతితో కార్యక్రమం ముగుస్తుంది.పూజా కార్యక్రమాలు ఆలయ ప్రధాన అర్చకులు కోట.శ్రీనివాస్,వైదిక కార్యక్రమాల పర్య వేక్షకుడు నాగాభట్ల.కామేశ్వర శర్మ,ముత్య.సత్యనారాయణ, బ్రహ్మశ్రీ చాగంటి.కన్నబాబు తదితరులు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి వి.త్రినాధరావు,ధర్మకర్తల మండలి సభ్యులు మరియు అధిక సంఖ్యలో భక్తులు,గ్రామస్థులు పాల్గొన్నారు.

# వివేకానంద హత్య కేసు విషయం పై సీబీఐ అధికారులు విచారణ వేగవంతం చేయాలి



భీమునిపట్నం (విజయభాను న్యూస్): వివేకానంద హత్య కేసు విషయం పై సీబీఐ అధికారులు విచారణ వేగవంతం చేసి ముద్దాయల్ని అరెస్ట్ చేయాలని టి డి పి రాష్ట్ర కార్యదర్శి, భీమిలి డివిజన్ అధ్యక్షులు గంటా నూకరాజు అన్నారు.గురువారం స్థానిక టి డి పి కార్యాలయంలో గంటా నూకరాజు మాట్లాడుతూ రాజ్యసభ సభ్యులు , సొంత బాబాయ్ హత్య జరిగితే దానికి రాజకీయ రంగు పులిమి ఎన్నికల్లో పబ్బం గడుపుకోవడానికి వై సి పీ ఆడిన నాటకానికి సిబిఐ త్వరలో ముగింపు పలుకుతుందని అన్నారు. సొంత పార్టీ నాయకులు, అనుచరులతో వివేకానంద హత్య చేయించి చంద్రబాబునాయుడు కారణమని ప్రజలను నమ్మించే ప్రయత్నం చేశారని అన్నారు. నిజం..నీతి.. నిజాయితీ..ధర్మం ఎప్పటికైనా విజయం సాధిస్తుందని, నిజాన్ని దాచే ప్రయత్నం చేసినా దైవశక్తి, చట్టం, న్యాయం ముందు ఎప్పటికైనా తలవంచాల్సిందేనని గంటా నూకరాజు అన్నారు. జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి, భీమిలి రూరల్ అద్యక్షులు డి ఏ ఎన్ రాజు మాట్లాడుతూ అబద్దాలు చెప్పడం, ప్రజల మైండ్ సెట్ ను మార్చడంలో ముఖ్యమంత్రిని మించిన వారెవరూ ఉండరని అన్నారు.

ఈ కార్యక్రమంలో నాయకులు దొకర సన్యాసప్పడు, పెంటపల్లి యోగీశ్వరావు, మారోజు సంజీవకుమార్, కాసరపు ఎల్లాజి, కొక్కిరి అప్పన్న, వియ్యపు పోతురాజు, వాడమొదలు రాంబాబు, గండిబోయిన పోలిరాజు, సిద్దార్థ వర్మ, దౌలపల్లి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# స్పందన ప్రజలు తృప్తిపరిచేలా వుండాలి







తరువాయి భాగం

దేశంలో ముందుండాలంటే సచివాలయాల స్థాయి లో బాగా పనిచేయాలన్నారు. జిల్లాలోని అధికారుల సూచనలు సలహాలు స్వీకరించి మరింతల మెరుగైన స్పందన గా తీర్చిదిద్దేందుకు వర్క్ షాప్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ స్పందన అంటే రాష్ట్రానికి గర్వకారణంగా దేశానికి ఆదర్శంగా ఉండాలన్నారు. ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంలో అలసత్వం చూపరాదని, కుల మతాలకు, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతీ ఒక్కరుకి ప్రభుత్వ పథకాలు అందాలన్నారు. పథకానికి తగిన అర్హతలు ఉన్నట్లైతే వారికి ఫలాలను అందేటట్లు చేయాలన్నారు. ఉద్యోగులు, వార్డు గ్రామ సచివాలయం ఉద్యోగులు అర్జీల పరిష్కారంలో పారదర్శకంగా ఉండాలన్నారు.

ప్రణాళికా శాఖ కార్యదర్శి విజయ్ కుమార్ మాట్లాడుతూ అర్జీలు స్వీకరణ చిరునవ్వుతో స్వీకరించాలన్నారు. ఎంపిడిఓ లు, తహసీల్దార్లు మండలంలోని గ్రామ వార్డు సచివాలయాల సిబ్బందికి తగు సూతనలివ్వాలన్నారు. అర్జీల పరిష్కారానికి వారికి తగిన శిక్షణ ఇవ్వాలని చెప్పారు. అర్జీల పరిష్కారంలో నాణ్యత సమయపాలన వుండాలన్నారు. ఎటువంటి అలసత్వం వహించినా చర్యలు తప్పవని చెప్పారు. బాధ్యత నిర్వర్తించేటప్పుడు పూర్తి స్థాయిలో ఉండాలన్నారు. అర్జీదారుల సమస్యలు తెలుసుకొని పొరపాటు జరగకుండా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రత్యేక కార్యదర్శి హరికృష్ణ మాట్లాడుతూ స్పందన కార్యక్రమం ముఖ్యమంత్రి కి అత్యంత ప్రీతికరమైనదన్నారు. అర్హత ఉన్నప్పటికీ ప్రభుత్వ పథకాలు అందని పరిస్థితుల్లో ముఖ్యమంత్రి స్పందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. స్పందన పై ప్రజల్లో నమ్మకం పెరగిననాడే అధికారులకు గౌరవం, ప్రభుత్వంపై నమ్మకం ఉంటుందని చెప్పారు. పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్ కోన శశిధర్ మాట్లాడుతూ స్పందన దరఖాస్తుల పరిష్కారానికి అవగాహనతో పాటు చిత్తశుద్ధి వుండాలన్నారు. ప్రభుత్వానికి, శాఖకు మంచి పేరు తెచ్చేందుకు, పేదవారికి సహాయ పడేందుకు స్పందనను ఉపయోగించుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ డా. ఏ.మల్లికార్జున మాట్లాడుతూ స్పందన దరఖాస్తులపై ప్రతీ కార్యాలయంలో ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలన్నారు. ఆయా శాఖల ద్వారా అమలు చేస్తున్న వివిధ పథకాలులో గల లోటుపాట్లు కూడా స్పందన ద్వారా తెలుసుకోవచ్చన్నారు. సిబ్బంది పనితీరును తెలియపరుస్తుందని చెప్పారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుండి జిల్లాలో స్పందన కార్యక్రమ నిర్వహణపై అవగాహన, సూచనలు తెలియజేసేందుకు ఉన్నతాధికారులకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ వర్క్ షాప్ లో పాల్గొన్న అధికారులు వారి మండలాల్లో సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించాలన్నారు. సభకు స్వాగతం పలికిన జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా ప్రతి పేదవారికీ ప్రభుత్వ పథకాలు అందేలా స్పందనను తీర్చి దిద్దాలన్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లాకు సంబంధించి పరిష్కారం చేసిన అర్జీల వివరాలను తెలియ పరస్తూ ఆయా శాఖలకు సంధించిన స్పందన వివరావలను విశ్లేషించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్లు పి. అరుణ్ బాబు, కల్పనాకుమారి, ఐటిడిఎ పి.వో గోపాలకృష్ణ, విఎంఆర్డిఎ కమీషనర్ వెంకట రమణారెడ్డి, పాడేరు సబ్ కలెక్టర్ అభిషేక్, ఆర్డీవోలు, ఉప కలెక్టర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు తాశీల్దార్లు, ఎంపిడివోలు పాల్గొన్నారు.

## విదేశాల్లో విద్య అభ్యసించాలనే యువతకు తమ సంస్థ ప్రోత్సాహమిస్తుంది

### యూనిఎక్సపర్ట్స్ సంస్థ విశాఖ బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్ సైదా సయ్యద్




విశాఖపట్నం (విజయభాను న్యూస్) : విదేశాల్లో విద్య అభ్యసించాలనే యువతకు తమ సంస్థ అనేక అవకాశాలు కల్పించి ప్రోత్సాహమిస్తుందని యూనిఎక్సపర్ట్స్ సంస్థ విశాఖ బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్ సైదా సయ్యద్ తెలిపారు.విశాఖ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్ బ్రోచర్ సహచరులు బిజినెస్ డెవలప్మెంట్ ఎగ్జిక్యూటివ్ రావాడ నాయుడు,అసిస్టెంట్ మేనేజర్ సెరన్ జయకార్ లతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులకు,తల్లితండ్రులకు అవగాహన కల్పించేందుకు ఈ నెల 19న గ్లోబల్ విర్చువల్ ఎడ్యుకేషన్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.వివిధదేశాల నుంచి ప్రముఖ యూనివర్సిటీ ప్రతినిధులు ఫెయిర్ లో పాల్గొంటారని ఆమె తెలిపారు.పదహారు సంవత్సరాల అనుభవంతో దాదాపు పందొమ్మిది వేలకు పైగా విద్యార్థులు తామసంస్థ ద్వారా విదేశాల్లో విద్యనభ్యసించినట్లు ఆమె తెలిపారు.వివిధ దేశాల్లో దాదాపు మూడువందల పైగా విద్యాసంస్థలతో కలిసి తాము పనిచేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఆస్ట్రేలియా, కెనడా,యూరప్,న్యూజీలాండ్,అమెరికా, యూకే తదితర దేశాల్లోని ప్రముఖ యూనివర్సిటీ ప్రతినిధులు పాల్గొనే ఫెయిర్ ను ఆసక్తిగల యువత వినియోగించుకోవాలని ఆమె కోరారు.ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేదని విద్య పూర్తైన తరువాత అక్కడే ఉద్యోగ అవకాశాలకు తమ ప్రతినిధులు సహకరిస్తారని తెలిపారు.ఆసక్తిగల వారు 0891 458 4444,7785968968 నెంబర్లలో సంప్రదించి రిజిస్టర్ చేసుకోవాలని కోరారు.

## ఘనంగా కొండల అగ్రహారం

# నల్లమారమ్మ తల్లి ఉత్సవాలు



నల్లమారమ్మతల్లిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే గణేష్

మాకవరపాలెం (విజయభాను న్యూస్) : మాకవరపాలెం మండలం కొండలఅగ్రహారం గ్రామ దేవత నల్ల మారమ్మతల్లి ఉత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. నర్సీపట్నం నుంచి విశాఖపట్నం వెళ్లే ప్రధాన రహదారిలో ఈ ఆలయం ఉంది. ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రజలు నిత్యం అమ్మవారిని దర్శించుకుంటారు. ప్రతియేటా ఇక్కడ ఉత్సవాలు నిర్వహిస్తారు. అమ్మవారి వార్షిక ఉత్సవాలు పురస్కరించుకొని ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయం వద్దకు బారులుతీరారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా నల్లమారమ్మతల్లి అంటే భక్తులకు నమ్మకం. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, తాగునీరు ఉచిత ప్రసాద వితరణ ఏర్పాట్లను నిర్వాహకులు చేశారు.

గురువారం అమ్మవారి ఉత్సవాల సందర్భంగా నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ నల్లమారమ్మ తల్లి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గూడూరు వెంకటరాజు, అమరావతి ట్రావెల్స్ యాజమానులు వాడపల్లి సన్యాసిరాజు(పెద్ద), వాడపల్లి వెంకట్ రాజు(చిన్న), వైసిపి నాయకులు చిటికెల వెంకటరమణ, ఈశ్వరరావు, చిన్న, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# టీటీడీ కి రూ.9 కోట్ల 20 లక్షలు విరాళం

- ఇందులో రూ 3 కోట్ల 20 లక్షలు చిన్నపిల్లల ఆసుపత్రికి
- రూ 6 కోట్ల ఆస్తి స్వామి వారికి
- టీటీడీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డికి పత్రాలు అందించిన దాత సోదరి



తిరుమల /తిరుపతి (విజయ భాను న్యూస్): టీటీడీ కి గురువారం రూ 9 కోట్ల 20 లక్షల విరాళం అందింది. ఇందుకు సంబంధించిన పత్రాలను దాత స్వర్గీయ డాక్టర్ ఆర్ పర్వతం జ్ఞాపకార్థం ఆమె సోదరి రేవతి విశ్వనాథం శ్రీవారి ఆలయంలో టీటీడీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి కి అందజేశారు. చెన్నై మైలాపూర్ కు చెందిన స్వర్గీయ డాక్టర్ పర్వతం పేరు మీద బ్యాంకు లో రూ 3 కోట్ల 20 లక్షల నగదు డిపాజిట్లు ఉన్నాయి. దీంతోపాటు రూ 6 కోట్ల విలువైన రెండు ఇళ్ళు ఉన్నాయి.

డాక్టర్ పర్వతం కన్నుమూయడంతో ఆమె జ్ఞాపకార్థం ఆమె సోదరి రేవతి విశ్వనాథం ఈ ఆస్తిని శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి విరాళంగా ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు పత్రాలను శ్రీవారి ఆలయంలోని రంగనాయక మండపంలో టీటీడీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి కి అందజేశారు.

## సర్పంచ్‌లను

# ఉత్సవ విగ్రహాలుగా మార్చేశారు



అమరావతి: ఉగ్రవాదులను మించిన పాలన వైకాపాది అని తెదేపా అధినేత చంద్రబాబు విమర్శించారు. సర్పంచ్‌లకు అధికారం లేకుండా చేశారని.. హక్కుల కోసం వారు చేసే పోరాటానికి తెదేపా మద్దతిస్తుందని చెప్పారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో తెదేపాకు చెందిన రాయలసీమ ప్రాంత జిల్లాల సర్పంచ్‌ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడారు."గ్రామాభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యం. వైకాపా ప్రభుత్వం సర్పంచ్‌లను ఉత్సవ విగ్రహాలుగా మార్చేసింది. సర్పంచులకు రాజ్యాంగం అధికారాలను ఇచ్చింది.

రాజ్యాంగ హక్కులను జగన్ హరిస్తున్నారు. సర్పంచుల అధికారాలను తీసుకోవడానికి ఆయన ఎవరు? ఇటీవల జరిగిన స్థానిక ఎన్నికల్లో అరాచకాలు చోటు చేసుకున్నాయి.

# విశాఖ, అనంతపురంలలో మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కులు

- రాష్ట్రంలో భారీ పెట్టుబడులకు డీపీ వరల్డ్ ఆసక్తి
- టీడీపీ హయాంలో రాష్ట్రాన్ని తన ప్రైవేటు కంపెనీలా వాడుకున్న చంద్రబాబు
- ఏరుదాటాక తెప్పతగలెయ్యడం బాబు మార్క్ పాలిటిక్స్
- పుంగనూరు ఆవుకు జాతీయ స్థాయి గుర్తింపు
- ఉక్రెయిన్ లోని భారతీయుల కోసం ప్రత్యేక విమానాలు పంపాలి

**- ట్విట్టర్ వేదికగా ఎంపీ(రాజ్యసభ) విజయసాయి రెడ్డి**



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : భారతదేశ తూర్పు తీరంలో ఆంధ్రప్రదేశ్ ను లాజిస్టిక్ హబ్ గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ చేపట్టిందని రాజ్యసభ సభ్యులు, వైకాపా జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయి రెడ్డి పేర్కొన్నారు. గురువారం ట్విట్టర్ వేదికగా పలు అంశాలు వెల్లడించారు. విశాఖపట్నం, అనంతపురం లలో రెండు మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కులు ఏర్పాటు చేసేందుకు కేంద్ర ఉపరితల రవాణా శాఖతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుందని అన్నారు. విశాఖ పట్నం 390 ఎకరాలు, అనంతపురం 205 ఎకరాలలో హబ్ లు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తుందని అన్నారు.

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు అనేక అంతర్జాతీయ కంపెనీలు ముందుకొస్తున్నాయని రాష్ట్ర పోర్టుల్లో పెట్టుబడులు పెట్టేందుకు దుబాయ్ కి చెందిన డీపీ వరల్డ్ సంస్థ ఆసక్తి కనబర్చగా, వ్యవసాయ అనుబంధ రంగాల్లో కలిసి పనిచేసేందుకు అబుదాబీకి చెందిన తబ్రేవ్ ఏషియాతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుందని అన్నారు.

అధికారంలో ఉన్నన్నాళ్లు చంద్రబాబు రాష్ట్రాన్ని ఒక ప్రైవేటు కంపెనీలా అందిన కాడికి దోచుకున్నారని. పొత్తులు, అబద్ధపు హామీలతో ఎన్నికల్లో గట్టెక్కుతూ14 ఏళ్లు అధికారం వెలగబెట్టారని, చివరకి ప్రతిపక్షంలో ఉండి కూడా ప్రజా సమస్యలపై పోరాడకుండా దుష్ప్రచారాలతో రాక్షసానందం పొందుతున్నారని అన్నారు.

చంద్రబాబు 5 ఏళ్ల పాలనలో నలుగురు డీజీపీలను మార్చినా ఒక్కరూ మాట్లాడలేదని. వైకాపా ప్రభుత్వంలో 30 నెలలు డీజీపీగా చేసిన గౌతమ్ సవాంగును మారిస్తే ఆయనపై ఎదో ప్రేమున్నట్లు పచ్చ బ్యాచ్ గగ్గోలు పెడుతోందని అన్నారు. ఏరుదాటాక తెప్ప తగలేయడం బాబు మార్క్ పాలిటిక్స్ అని గుర్తుచేసారు.

సవాంగ్ ను ఏపిపిఎస్సి చైర్మన్ చేయడంతో పచ్చ మీడియాకు షాక్ తగిలినట్లయ్యిందని అన్నారు.

మన పుంగనూరు ఆవుకు జాతీయస్థాయిలో గుర్తింపు లభించడం సంతోషంగా ఉందని, పోస్టల్ శాఖ పుంగనూరు జాతి ఆవు పేరుతో పోస్టల్ స్టాంప్, కవర్ విడుదల చేయడం రష్ట్రానికే గర్వకారణమని అన్నారు. అంతరించి పోతున్న ఈ జాతి ఆవులను అభివృద్ధి చేసేందుకు సీఎం జగన్ వైఎస్సార్ కడప జిల్లాలో 70 కోట్లతో పరిశోధనా కేంద్రం ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు

రష్యా నుండి ముప్పు ఉన్న కారణంగా ఉక్రెయిన్ లో నివసిస్తున్న భారతీయులను ముఖ్యంగా విద్యార్థులను త్వరగా, సురక్షితంగా తిరిగి రావడానికి మరిన్ని ప్రత్యేక విమానాలను ఆ దేశానికి పంపాలని కేంద్ర ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నానని అన్నారు. వివిధ కారణాలతో అక్కడ నివాసిస్తున్న భారతీయుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని విదేశాంగ మంత్రిత్వ శాఖ తక్షణమే చర్యలు తీసుకుంటుందని ఆశిస్తున్నానుని ఎంపీ విజయసాయిరెడ్డి అన్నారు.

# ఏపీ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

**- మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు**



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : ఆంధ్రప్రదేశ్ లో 21 వేల 559 కోట్లతో 1380 కిలోమీటర్ల జాతీయ రహదారులు ప్రారంభోత్సవం మరియు భూమి పూజ కార్యక్రమం విజయవాడలో కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ చేతులమీదుగా జరుగుతున్న సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి మరియు నితిన్ గడ్కరీ కి భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ యంమ్మెల్యే విష్ణు కుమార్ రాజు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్రం యొక్క అభివృద్ధి కేవలం భారతీయ జనతా పార్టీ మాత్రమే చేయగలదని అన్నారు. ఈ అభివృద్ధిలో భాగంగానే విశాఖపట్నంలో 51 కోట్ల రూపాయలతో నాలుగు లైన్ల రహదారి నిర్మాణ పనులు చేపట్టడం జరుగుతుందని తెలుపుతూ వారికి ధన్యవాదాలు తెలిపారు.

భారతీయ జనతాపార్టీ విశాఖ పార్లమెంటు జిల్లా అధ్యక్షులు రవీంద్ర మేడపాటి మాట్లాడుతూ విశాఖ పోర్టు ఏరియా నుండి జాతీయ రహదారి 16 వరకు ఉన్న 3 .49 కిలోమీటర్ల రహదారిని నాలుగు లైన్ల రహదారి గా అభివృద్ధి చేస్తుండడం సంతోష దాయకమని అందుకుగాను వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు కేతినేని సురేంద్రమోహన్ మాట్లాడుతూ దేశం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్లాలంటే జాతీయ రహదారులు కీలకమని తద్వారా వస్తు రవాణా వేగవంతమై ఆర్థిక అభివృద్ధి జరుగుతుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డా.సుహాసిని ఆనంద్, బీజేపీ అనకాపల్లి పార్లమెంట్ జిల్లా ఇంచార్జి ఎస్ వీ ఎస్ ప్రకాష్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర ఆర్ టీ ఐ సెల్ కన్వీనర్ వెంగమాంబ శ్రీనివాస బాబు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్ వీ ఎస్ ఎన్ కొప్పిశెట్టి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు బోగాది స్వామి నాయుడు, కె. సుబ్రహ్మణ్యం, మురుకొండ సురేష్ బాబు, వర్రే లలిత తదితరులు పాల్గొన్నారు.

# బ్యాంక్ ఆఫ్ బరోడా నుండి మీకు నచ్చిన భాషల నందు బ్యాంకింగ్ లావాదేవీ వివరాలను పొందవచ్చును

విశాఖసిటీ (విజయభాను న్యూస్) : దేశంలోని ప్రముఖ బ్యాంక్ అయిన బ్యాంక్ ఆఫ్ బరోడా అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం (21 ఫిబ్రవరి) పురస్కరించుకుని ఖాతాదారులకు వారికి నచ్చిన భాషలో బ్యాంక్ ఖాతా లావాదేవీల సమాచారాన్ని అందుబాటులో ఉంచే ఎంపిక చేసుకొనే సదుపాయములను ప్రోత్సహించడానికి బ్యాంక్ తమ శాఖలలో 3 రోజుల పాటు ఎస్ఎమ్ఎస్ లాగిన్ డే నిర్వహిస్తుంది. బ్యాంక్ అందించిన ఈ సదుపాయాన్ని ఎంచుకోవడం ద్వారా ఖాతాదారులు తమకు నచ్చిన భాషలో ఎస్ఎమ్ఎస్‌ని స్వీకరించగలరు. దీనికోసం ఖాతాదారులు బ్యాంక్‌లో నమోదు చేసిన వారి మొబైల్ నెంబర్ నుండి 8422009988 నెంబర్‌కు హెచ్ఐఎన్ (హిందీ) భాష కోసం **LANG<space>HIN** అని, ఇతర భాషలు అనగా టిఎఎం (తమిళం), కెఎఎన్ (కన్నడ), ఎఎస్ఎం(అస్సామి), బిఇఎన్(బంగ్లాజ్), జియుజె(గుజరాతి), ఎంఎఎల్ (మలయాళం), ఎంఎఆఎ (మరాఠి), ఓఆర్ఐ (ఒరియా), పిఎఎన్ (పంజాబీ), టిఇఎల్ (తెలుగు), యుఆర్డి(ఉర్దూ) కోసం అని ఎస్ఎమ్ఎస్ పంపాలి.

వివిధ మాధ్యమాల ద్వారా ఈ సదుపాయాన్ని తమ ఖాతాదారులకు అందుబాటులోకి తెచ్చేందుకు బ్యాంక్ ప్రయత్నిస్తుంది. ఈ దిశలో భాగంగా ఈనెల 18, 19 మరియు 21వ తారీఖులలో దేశవ్యాప్తంగా ఎస్ఎమ్ఎస్ లాగిన్ డే ద్వారా మరింత మంది ఖాతాదారులకు ఈ సదుపాయాన్ని కనెక్ట్ చేయాలని బ్యాంక్ యోచిస్తుంది. ప్రస్తుతం బ్యాంక్ ఆఫ్ బరోడా తన ఖాతాదారులకు ఇంగ్లీష్‌తో సహా 12 భారతీయ భాషలలో లావాదేవీల సమాచారాన్ని ఎస్ఎమ్ఎస్ ద్వారా అందిస్తుంది. తద్వారా ఎటువంటి మోసం జరగకుండా నివారించవచ్చు మరియు బ్యాంక్ యొక్క ఈ చొరవ వలన బ్యాంకింగ్ సేవలను సరళంగా మరియు పారదర్శకంగా చేయడమే కాకుండా ఖాతాదారులకు వారి ఖాతా యొక్క లావాదేవీల సంబంధిత కార్యకలాపాల గురించి తమ మాతృభాషలో తెలుసుకునే విధంగా చేయడమే తన లక్ష్యంగా పెట్టుకుంది.






పిఎఫ్ఆర్ సందర్భంగా జిల్లాకు రాష్ట్రపతి విచ్చేస్తున్నందువలన ఎయిర్ పోర్ట్, ఐఎన్ఎస్ డేగా, జెట్టీ నేవీ ఉన్నతాధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ డా.ఏ.మల్లిఖార్జున మరియు కమిషనర్ ఆఫ్ పోలీస్ మనీష్ కుమార్ సిన్హా

# జివిఎంసి ఖాళీ స్థలాలను పరిరక్షించండి

**- జివిఎంసి కమిషనర్ డాక్టర్ జి. లక్ష్మిశ**



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : మహా విశాఖపట్నం నగరపాలక సంస్థకు చెందిన ఖాళీ స్థలాలను పరిరక్షించాలని జివిఎంసి కమిషనర్ డాక్టర్ జి. లక్ష్మీశ పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన 3వ జోన్ 16వ వార్డు పరిధిలోని కె.ఆర్.ఎం. కోలనీ, కృష్ణా కాలేజి రోడ్డు, చాకలి గెడ్డ తదితర ప్రాంతలలో వార్డు కార్పొరేటర్, స్థాయి సంఘ సభ్యురాలు మొల్లి లక్ష్మితో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జివిఎంసి కి చెందిన ఖాళీ స్థలాలు ఆక్రమణ చెందకుండా చూడాలని, కె.ఆర్.ఎం. కొలనీలోని శివాలయం వద్ద ఉన్న ఖాళీ స్థలంలో వ్యర్థాలు అధికంగా పడవేస్తుండడంతో ఆ ప్రాంతంను శుభ్రం చేసి ముగ్గులు, పూల కుండీలు ఏర్పాటు చేయడంతో ఆ ప్రాంతం సుందరంగా తయారయ్యిందని, ఇదే స్ఫూర్తి తో చెత్త పడే ప్రాంతాలను గుర్తించి ఆ ప్రాంతంలో ముగ్గులు, మొక్కలు ఏర్పాటు చేసి నగర పరిశుభ్రతకు పాటుపడాలని సిబ్బందిని ఆదేశించారు. చాకలిగెడ్డలోని ఆక్రమణలను తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. అనంతరం స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాలీలో పాల్గొని స్వచ్ఛ సర్వేక్షణ్-2022లో మెరుగైన ర్యాంకు సాధనకు అందరితో కలసి పనిచేయాలని, కార్యదర్శులు ప్రతి ఇంటికి వెళ్లి స్వచ్ఛ సర్వేక్షణ్ పై, తడి-పొడి చెత్త వేరు చేసి ఇవ్వాలని, సేంద్రీయ ఎరువు తయారిపైన, సీజనల్ వ్యాదులైన మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా వంటి వ్యాధులు వ్యాప్తి చెందకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. కెఆర్ఎం కోలనీ వర్షాకాలంలో ఎక్కువగా ముంపుకు గురి అవుతుందని, భూ గర్భ మురుగు నీరు ఎక్కడికక్కడ బ్లాకు అవుతున్నాయని, కాలువలో పూడికలు తీయించాలని, ఆర్.కె. పార్కు వద్ద ఉన్న స్థలంలో రెండు అంతస్తుల కమ్యునిటీ హాలు నిర్మించాలని స్థానిక కార్పొరేటర్ కమిషనర్ దృష్టికి తీసుకురాగా కమిషనర్ స్పందిస్తూ తెలిపిన ప్రతి సమస్యను యాక్షన్ ప్లాన్ ప్రకారం అంచలంచెలుగా పరిష్కరిస్తామని తెలిపారు.

ఈ పర్యటనలో ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కెఎస్ఎల్ జి శాస్త్రి, జోనల్ కమిషనర్ శివ ప్రసాద్, పర్యవేక్షక ఇంజినీరు శివ ప్రసాద రాజు, ఎఎంఒహెచ్ డాక్టర్ లక్ష్మి తులసి, కార్యనిర్వాహక ఇంజినీర్లు సుధాకర్, రాయల్ బాబు, అసిస్టెంట్ ఇంజినీర్లు రహీం, శ్రీరామమూర్తి, టిపిఒ రాజు, శానిటరీ సూపర్వైజర్ జనార్ధన్, శానిటరీ ఇన్స్పెక్టర్, వార్డు సచివాలయ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of VIJAYABHANU PUBLICATIONS ., Published and Printed at VIJAYABHANU PRESS, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com